


# ప్రజాస్ఫూర్తి
PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 24-03-2026 | సంపుటి - 27 | సంచిక -301 | రూ : 4 | పేజీలు: 8


# గిగ్ వర్కర్లకు చట్టబద్ధ గుర్తింపు

- విద్వేషపూరిత ప్రసంగాలకు కళ్లెం
- న్యాయవాదుల సంరక్షణకు పెద్దపీట
- రోహిత్ వేముల చట్టం విధివిధానాల రూపకల్పనకు ఉపసంఘం
- వృద్ధ తల్లిదండ్రులను ఆదరించకపోతే వేతనంలో కోత
- పలు కీలక బిల్లులకు మంత్రిమండలి ఆమోదం



హైదరాబాద్: నిత్యం ఆహారం, సరకు రవాణా, లాజిస్టిక్స్ వంటి సేవలందిస్తూ జీవిస్తున్న రాష్ట్రంలోని సుమారు 4.2 లక్షల మంది గిగ్, ప్లాట్‌ఫామ్ బేస్డ్ కార్మికులకు రక్షణ కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కొత్త శ్రామికశక్తి విభాగానికి సామాజిక భద్రత, సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకోసం రూపొందించిన ముసాయిదా బిల్లును మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇకపై సామాజిక భద్రతకు భంగం కలిగించేలా ఎవరు విద్వేషపూరిత ప్రసంగాలు చేసినా.. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేలా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తరువాయి 2లో



## ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి పెద్ద స్కామ్

2లో


- విచారణకు హౌస్ కమిటీ వేయాలి
- ప్రశ్నోత్తరాల్లో బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు
- మీరు చెప్పినోళ్లకు ఇవ్వకపోతే అవినీతి జరిగినట్టా?
- ఆ దేశ ప్రభుత్వంతో నేరుగా ఒప్పందం చేసుకున్నాం : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

## ఇరాన్ విషయంలో వెనక్కి తగ్గిన ట్రంప్

- ఇరాన్ విద్యుత్తు కేంద్రాలపై దాడులకు 5 రోజుల విరామమిచ్చిన అధ్యక్షుడు
- గౌరవనీయ' ఇరాన్ నేతతో చర్చలు జరుగుతున్నాయని వెల్లడి
- ఆ నేత మొజ్తాబా కాదని స్పష్టీకరణ
- చర్చలేం జరగలేదన్న ఇరాన్
- హర్మూజ్ మూసివేత హెచ్చరికతోనే ట్రంప్ దిగొచ్చారని స్పష్టీకరణ



2లో



## లోక్‌సభ.. అసెంబ్లీ స్థానాలు 50% పెంపు

- 2029 ఎన్నికల నుంచి అమల్లోకి!
- అప్పుడు తెలంగాణలో 179, ఏపీలో 263 శాసనసభ సెగ్మెంట్లు
- దేశంలో 543 నుంచి 816కి లోక్‌సభ స్థానాలు
- ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు
- ఎన్డీయే భాగస్వాములకు చెప్పిన అమిత్‌షా
- ముందుగానే మహిళా రిజర్వేషన్ కోటా

ఢిల్లీ: లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50% పెంచాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లును ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి సిద్ధమైనట్లు తెలిసింది. దీని ప్రకారం పార్లమెంటు స్థానాలు 543 నుంచి 816కి చేరుతాయి. తరువాయి 2లో

## మావిద్యుత్ కేంద్రాల జోలికొస్తే..




2లో

- పర్షియన్ గల్ఫ్ అంతటా మైన్స్ పెడతాం
- ప్రతీకార దాడులు తీవ్రతరం చేస్తాం
- హెచ్చరించిన ఇరాన్
- టెహ్రాన్ లక్ష్యంగా వైమానిక దాడులు

ఇరాన్‌పై అమెరికాఇజ్రాయిల్ ప్రారంభించిన యుద్ధం సోమవారం 24వ రోజుకు చేరుకుంది. దాడులు ప్రతి దాడులు, హెచ్చరికలు బెదిరింపుల మధ్య మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తత పెరిగిపోతోంది. హర్మూజ్ జలసంధిని 48 గంటలలో తెరవకపోతే ఇరాన్‌లోని విద్యుత్ వ్యవస్థలను నేలమట్టం చేస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన బెదిరింపులపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ తీర ప్రాంతాలు, దీవుల జోలికి వస్తే హర్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేస్తామని తరువాయి 2లో



## ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌తో ఉత్తరాంధ్రలో కొత్త శకం

- ఏపీ పారిశ్రామికవృద్ధిలో ఇది మేలిమలుపు
- 2028 డిసెంబరు నాటికి ఉత్పత్తి ప్రారంభం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగాలు
- శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

2లో

## కొత్త చరిత్ర సృష్టిస్తుందా?

- బెంగాల్ టైగర్ల బరి భవానీపూర్
- టీఎంసీకి అత్యంత విశ్వసనీయమైన స్థానమిది
- ఇక్కడి నుంచే మమతపై పోటీకి దిగుతున్న సువేందు అధికారి
- ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట... ప్రస్తుతం తృణమూల్ ఖిల్లా..

2లో





## కూలిన యుద్ధ విమానం

- వందమందికిపైగా సైనికులు మృతి
- కొలంబియా దక్షిణ అమెజాన్ ప్రాంతంలో ప్రమాదం
- ధ్రువీకరించిన కొలంబియా రక్షణమంత్రి సాంచెజ్

2లో

# ఇరాన్ విషయంలో వెనక్కి తగ్గిన ట్రంప్

దుబాయ్: హర్మూజ్‌ను తెరవకపోతే ఇరాన్‌లోని విద్యుత్తు కేంద్రాలపై భీకర దాడులు చేస్తామన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనూహ్యంగా వెనక్కి తగ్గారు. ఈ దాడులకు 5 రోజుల విరామం ప్రకటించారు. గౌరవనీయ ఇరాన్ నేతతో చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. అయితే చర్చల ప్రకటనను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అసలు చర్చలే జరగడం లేదని స్పష్టం చేసింది. హర్మూజ్‌ను పూర్తిగా మూసివేస్తామని హెచ్చరించడంతోనే ఆయన దిగివచ్చారని పేర్కొంది. ఆర్థిక, చమురు మార్కెట్ల స్థిరీకరణ కోసం జరుగుతున్న ప్రయత్నమిదని వ్యాఖ్యానించింది. యుద్ధం నేపథ్యంలో సోమవారమూ స్టాక్ మార్కెట్లు అల్లకల్లోలమయ్యాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 1800 పాయింట్లకుపైగా పతనమైంది.

**పరస్పర విరుద్ధ ప్రకటనలు**

'సుహృద్భావ వాతావరణంలో ఇరాన్‌తో ఫలవంతమైన చర్చలు జరిగాయి. అవి సంపూర్ణ పరిష్కారం దిశగా సాగాయి. ఈ వారమంతా చర్చలు జరుగుతాయి. ప్రస్తుతం జరుగుతున్న సమావేశాలు, చర్చల ఫలితంగానే విద్యుత్తు ప్లాంట్లపై దాడులను నిలిపివేస్తున్నాం' అని తన సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ ప్రకటించారు. అయితే చర్చల వివరాలను, ఎక్కడ జరుగుతుందీ ఆయన వెల్లడించలేదు. ట్రంప్ ఈ ప్రకటన చేసిన వెంటనే ఇరాన్ అధికార టీవీ ఛానల్ ఒక ప్రకటనను చదివి వినిపించింది. 'ఇరాన్ గట్టి హెచ్చరికలతో అమెరికా అధ్యక్షుడు వెనక్కి తగ్గారు' అని ప్రకటించింది. మరోవైపు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌కు(ఐఆర్‌జీసీ) సన్నిహితంగా ఉండే రెండు వార్తా సంస్థలు.. అమెరికాతో చర్చలేవీ జరగలేదని స్పష్టంచేశాయి. సోమవారం ఉదయం మాత్రం.. ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. తాను తుర్కియే విదేశాంగ మంత్రి హకన్ ఫిదాతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. గతంలో అమెరికా, ఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిగా తుర్కియే వ్యవహరించింది. రష్యా విదేశాంగ మంత్రితోనూ అబ్బాస్ చర్చలు జరిపారు. అమెరికాతో చర్చలు జరుగుతున్నాయన్న వార్తలను ఇరాన్ విదేశాంగశాఖ ఖండించింది. ఆర్థిక, చమురు మార్కెట్లను తారుమారు చేయడానికి, అమెరికా, ఇజ్రాయెల్ చిక్కుకున్న చిక్కుముడుల నుంచి బయటపడటానికి ఫేక్ వార్తలను ప్రచారం చేస్తున్నారని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘెర్ ఖలీబా ఎక్స్‌లో పేర్కొన్నారు. ఖలీబాతో సమావేశం ఏర్పాటు చేయాలని అమెరికా కోరినట్లు ఇరాన్ అధికారి ఒకరు తెలిపారు. అయితే దీనిపై సుప్రీం నేషనల్ కౌన్సిల్ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని వివరించారు. దీనినిబట్టి ట్రంప్ పేర్కొన్న గౌరవనీయ నేత ఖలీబానేనని స్పష్టమవుతోంది.

**అసలేం జరిగింది?**

తమ విద్యుత్తు కేంద్రాలను పేల్చేస్తామని ట్రంప్ ప్రకటించిన తర్వాత సోమవారం ఉదయం ఇరాన్ ప్రతిస్పందించింది. పశ్చిమాసియాలోని విద్యుత్తు కేంద్రాలపై తాము దాడులు చేస్తామని, పర్షియన్ గల్ఫ్‌లో సీమైన్లతో పేలుళ్లకు పాల్పడతామని హెచ్చరించింది.

# ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి పెద్ద స్కామ్

హైదరాబాద్ : ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి పెద్ద స్కామ్ అనీ, దానిపై విచారణకు హౌస్ కమిటీ వేయాలని స్పీకర్‌ను బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత టి.హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బియ్యం ఎగుమతి చేయడానికి పెట్టుకున్న అడ్వైజర్ ఘరానా మోసగాడు.. ఈడీ, సీబీఐ కేసులున్న వ్యక్తిని ఎలా అడ్వైజర్‌గా నియమించుకున్నారు? అది నిజమా? కాదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ...బియ్యం ఎగుమతికి సంబంధించి మీరు రికమండ్ చేసిన వ్యక్తికి ఇవ్వడానికి ఒప్పుకోకపోతే అవినీతి జరిగినట్టా హరీశ్‌రావు అంటూ ధీటుగా సమాధానమిచ్చారు. సోమవారం శాసనసభలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు అనే అంశంపై హరీశ్‌రావు, పల్లారాజేశ్వర్‌రెడ్డి పలు ప్రశ్నలను సంధించారు.హరీశ్‌రావు మాట్లాడుతూ...ప్రేమ్‌చంద్ గార్గే ఇచ్చిన సలహా వల్ల రాష్ట్రానికి నష్టం జరిగింది వాస్తవం కాదా? అని నిలదీశారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి కోసం ఎంఓయూ చేసుకున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుండగా..ఇప్పుడు అది పెద్ద స్కామ్‌గా మారిందని ఆరోపించారు. నాఫెడ్ సంస్థ ముందే డబ్బులు ఇస్తామని హామీనిస్తే బియ్యం ఇయ్యకుండా ప్రయివేటు సంస్థకు ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఎగుమతి 27,500 మెట్రిక్ టన్నుల వద్దనే ఎందుకు ఆగిపోయిందని నిలదీశారు. ఏడాదిగా 7500 మెట్రిక్ టన్నుల బియ్యం కాకినాడ పోర్టులో ముక్కిపోతున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. గోదాం, హ్యాండ్లింగ్ చార్జీల భారం ప్రభుత్వం మీద పడట్లేదా? అని అడిగారు. వాటాలు తేలకపోవడమే ఎగుమతి ఆగిపోవడానికి కారణం కాదా? అని ప్రశ్నించారు. కొందరి తీరుతో ప్రభుత్వా నికి పెద్ద ఎత్తున నష్టం జరిగిందని ఆరోపించారు. హౌస్ కమిటీ వేస్తే నిరూపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు సన్నవడ్లకు సంబంధించి రూ.1208 కోట్ల బోనస్ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. రైతుల నుంచి ధాన్యాన్ని ఆలస్యంగా సేకరించడాన్ని తప్పుబట్టారు. మరిన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

*** నిరాధార ఆరోపణలతో తప్పుదోవ పట్టించొద్దు : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

సభలో నిరాధార ఆరోపణలు చేయడం హరీశ్‌రావుకు తగదని రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మీరు రికమండ్ చేసిన వ్యక్తికి బియ్యం ఎగుమతి ఒప్పందం ఇవ్వకపోతే అవినీతి జరిగినట్టా? ఏ అధికారి దగ్గరకు వెళ్లి ఒత్తిడి చేశారో చెప్పాలా? అంటూ హరీశ్‌రావును ప్రశ్నించారు. ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతిలో ఎలాంటి మధ్యవర్తులు లేరనీ, నేరుగా ఆ దేశ ప్రభుత్వంతో మన సర్కారు లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నదని స్పష్టం చేశారు. మొదటి విడతలో 12,750 మెట్రిక్ టన్నులు, రెండో విడతలో 10 వేల మెట్రిక్ టన్నులు మొత్తంగా 22,750 మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి చేశామనీ, క్వింటాకు రూ.3,600 చొప్పున అమ్మామని వివరించారు. గోదాముల్లో నిల్వ, ఇన్సూరెన్స్, తదితరాలన్నింటినీ ఆ దేశ ప్రభుత్వమే భరిస్తున్నదని తెలిపారు. ఎఫ్‌సీఐ గ్రేడ్‌ఏ రకానికి నియమించి రూ.3,446 కంటే ఇది అధికమని చెప్పారు. ఆ దేశానికి బియ్యం ఎగుమతుల ద్వారా ఇప్పటి వరకూ రూ. 81.90 కోట్ల ఆదాయం వచ్చిందనీ, రూ.1.13 కోట్ల నికర లాభం వచ్చిందని వివరించారు. ఫిలిప్పీన్స్‌లో ఏర్పడిన రాజకీయ సంక్షోభం వల్ల ఎగుమతుల విషయంలో ఆలస్యం జరుగుతున్నదని తెలిపారు.

# గిగ్ వర్కర్లకు చట్టబద్ధ గుర్తింపు

హైదరాబాద్: నిత్యం ఆహారం, సరకు రవాణా, లాజిస్టిక్స్ వంటి సేవలందిస్తూ జీవిస్తున్న రాష్ట్రంలోని సుమారు 4.2 లక్షల మంది గిగ్, ప్లాట్‌ఫామ్ బేస్డ్ కార్మికులకు రక్షణ కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కొత్త శ్రామికశక్తి విభాగానికి సామాజిక భద్రత, సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ఇందుకోసం రూపొందించిన ముసాయిదా బిల్లును మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇకపై సామాజిక భద్రతకు భంగం కలిగించేలా ఎవరు విద్వేషపూరిత ప్రసంగాలు చేసినా.. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేలా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. న్యాయవాదుల సంరక్షణకు ప్రత్యేక చట్టాన్ని తేనుంది. అసెంబ్లీ కమిటీ హాలులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. ఇందులో పలు కీలక నిర్ణయాలు, బిల్లులకు ఆమోదం లభించింది.

**మంత్రివర్గం ఆమోదించిన అంశాలు..**

గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల సంక్షేమం, భద్రత కోసం రూపొందించిన 'తెలంగాణ ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్(రిజిస్ట్రేషన్, సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్) యాక్ట్, 2026' బిల్లును క్యాబినెట్ ఆమోదించింది. కొత్త బిల్లు ప్రకారం వర్కర్స్ రిజిస్ట్రేషన్‌తో పాటు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు, సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తారు. ఈ బిల్లు ప్రకారం.. గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు, సామాజిక భద్రత, వారి హక్కులకు రక్షణ లభిస్తుంది. గతంలో మంత్రివర్గం ఆమోదించిన బిల్లును ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన 'సోషల్ సెక్యూరిటీ కోడ్'కు అనుగుణంగా స్వల్ప మార్పులతో క్యాబినెట్ ఆమోదించింది. విద్వేషపూరిత ప్రసంగాలు, నేరాల నిరోధక బిల్లు(తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు 2026)ను మంత్రివర్గం ఆమోదించింది. మత సామరస్యానికి భంగం కలిగించే పోస్టులు, అల్లర్లు, ఘర్షణలు ప్రేరేపించే ప్రసంగాలను కట్టడి చేసేందుకు ఈ బిల్లును రూపొందించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతమున్న 69 కి.మీ. మెట్రో వ్యవస్థను ఎల్ అండ్ టీ సంస్థ నుంచి స్వాధీనం చేసుకునే చర్యలు వేగవంతం చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. రుణభారం సహా మొత్తం రూ.15,000 కోట్లు ప్రభుత్వం ఎల్ అండ్ టీకి చెల్లించి.. ఫేజ్ 1 ప్రాజెక్టు స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుందని ఇప్పటికే ఉపసంఘం నివేదిక సమర్పించింది. ప్రభుత్వం తరఫున ఈ నిధుల చెల్లింపులు, లావాదేవీల బాధ్యతను నిర్వర్తించే బాధ్యతను 'హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్'కు అప్పగించింది. దీన్ని నోడల్ ఏజెన్సీగా నియమించేందుకు క్యాబినెట్ అంగీకరించింది. 'తెలంగాణ అడ్వొకేట్ ప్రొటెక్షన్ బిల్లు'ను మంత్రిమండలి ఆమోదించింది. న్యాయవాదులపై జరుగుతున్న దాడుల ఘటనలను కట్టడి చేసేందుకు, న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకు బిల్లు రూపొందించారు. గతంలో జరిగిన అడ్వొకేట్ వామనరావు దంపతుల హత్య నేపథ్యంలో.. న్యాయవాదులకు రక్షణ, భద్రత కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేయడానికి రాష్ట్రప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ నివేదికను మంత్రిమండలి ఆమోదించింది. 'ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ వర్కింగ్ గ్రూప్' ఛైర్మన్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలోని నిపుణుల కమిటీ నివేదిక తయారుచేసింది. సామాజిక న్యాయం, అన్ని వర్గాల సాధికారత లక్ష్యంగా దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల సర్వే నిర్వహించింది. 2024 నవంబరు 6 నుంచి డిసెంబరు 25 వరకు 50 రోజుల పాటు రాష్ట్రమంతటా సర్వే నిర్వహించింది. నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించే బాధ్యతను క్యాబినెట్ సబ్ కమిటీకి అప్పగించింది. విద్యాలయాల్లో కుల వివక్షను నియంత్రించేందుకు ఉద్దేశించిన 'రోహిత్ వేముల చట్టం' విధివిధానాల రూపకల్పనకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఉపసంఘం సభ్యులుగా మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఉంటారు.

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఆదరించని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు.. ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని.. మినహాయించి వృద్ధులకు అందజేసే 'తల్లిదండ్రుల మద్దతు బిల్లు'ను క్యాబినెట్ ఆమోదించింది.

# లోక్‌సభ.. అసెంబ్లీ స్థానాలు 50% పెంపు

ఢిల్లీ: లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను 50% పెంచాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లును ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి సిద్ధమైనట్లు తెలిసింది. దీని ప్రకారం పార్లమెంటు స్థానాలు 543 నుంచి 816కి చేరుతాయి. 4,123 ఉన్న అసెంబ్లీ స్థానాలు 6,185 అవుతాయి. తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 175 ఎమ్మెల్యే స్థానాలు 263కి చేరుతాయి. లోక్‌సభ స్థానాలు ఏపీలో 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి చేరే అవకాశం ఉంటుంది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని సోమవారం సాయంత్రం ఎన్డీయే సమావేశంలో భాగస్వామ్య పక్షాలకు కేంద్రం చెప్పింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌ల నేతృత్వంలో ఈ భేటీ జరిగింది. కాంగ్రెసేతర విపక్షాలతోనూ విడిగా భేటీ నిర్వహించారు. కాంగ్రెస్‌తోనూ షా మాట్లాడే అవకాశం ఉంది. నియోజకవర్గాల సంఖ్య పెంచడానికి వీలుగా ముందుగా మహిళా రిజర్వేషన్ చట్టం, డీలిమిటేషన్ చట్టాలకు సవరణలు ప్రతిపాదిస్తూ ఈ పార్లమెంటు సమావేశాల్లో బిల్లులు తీసుకురాబోతున్నట్లు తెలిసింది. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయని సమాచారం.

**ప్రాథమిక జనాభా లెక్కల వివరాలతోనే..**

2023 సెప్టెంబరులో ఆమోదించిన బిల్లు ప్రకారం 2034 నుంచి మహిళలకు 33% రిజర్వేషన్లు అమల్లోకి రావాలి. రాజ్యాంగ అధికరణలు 170(3), 81(3) ప్రకారం.. 2026 తర్వాత ప్రచురించే జనాభా లెక్కల ఆధారంగా దేశంలో నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిబంధన ఉంది. అందువల్ల కేంద్రం మహిళా రిజర్వేషన్ల అమలును 2034 నుంచి అమల్లోకి తేనుంది ఇదివరకు భావించారు. ఇప్పుడు జనగణన 2027 మార్చి 1కల్లా పూర్తికానుండటంతో ప్రాథమిక జనాభా లెక్కల వివరాలు ప్రకటించి.. ఆ వెంటనే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టొచ్చు. ఈ అంశంపై అన్ని పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు మొదలుపెట్టింది.

# కూలిన యుద్ధ విమానం

బోగోటా: దక్షిణ కొలంబియాలోని పుట్యుమాయో ప్రావిన్స్‌లో కొలంబియా వైమానిక దళానికి చెందిన 'లాక్ హీడ్ మార్టిన్ హెర్క్యులస్ సీ130' రవాణా విమానం కూలిపోయింది. ఈ ప్రమాదంలో వందమందికిపైగా సైనికులు మృతి చెందారు. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో సుమారు 110 మంది ప్రయాణిస్తున్నట్టు స్థానిక మీడియా సంస్థ బ్లూ రేడియో వెల్లడించింది. పెరూ సరిహద్దుకు సమీపంలోని ప్యూర్టో లెగుయిజామో ఎయిర్‌ఫీల్డ్ నుంచి ఈ విమానం టేకాఫ్ తీసుకుంటున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

**సరిహద్దు ప్రాంతంలో ప్రమాదం**

ఈ విమాన ప్రమాదంపై కొలంబియా రక్షణ మంత్రి పెడ్రో ఆర్నుల్ఫో సాంచెజ్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. అమెజాన్ అడవుల మధ్య ఉన్న దక్షిణ సరిహద్దు ప్రాంతంలో భద్రతా దళాలను తరలిస్తుండగా ప్రమాదం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, సాంకేతిక లోపం వల్ల జరిగిందా లేదా ఇతర కారణాలా? అనే కోణంలో విచారణ జరుపుతున్నామని మంత్రి తెలిపారు. ప్రమాద సమయంలో విమానంలో 80 నుంచి 110 మంది వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే ఈ విమానం కూలిన ప్రదేశం పట్టణ కేంద్రానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలోనే ఉంది.

*** మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి**

"ఇది అత్యంత బాధాకరమైన సమయం. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా." అని మంత్రి సాంచెజ్ అన్నారు.

**కొనసాగుతున్న సహాయక చర్యలు**

ప్రమాద వార్త తెలిసిన వెంటనే సైనిక విభాగాలు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. విమానం మంటల్లో పూర్తిగా కాలిపోయినట్టు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత నెలలో కూడా ఇలాంటిదే హెర్క్యులస్ విమానం బొలీవియాలో కూలి 20 మందికి పైగా మరణించిన సంగతి తెలిసిందే.

# మా విద్యుత్ కేంద్రాల జోలికొస్తే..

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ ప్రారంభించిన యుద్ధం సోమవారం 24వ రోజుకు చేరుకుంది. దాడులు-ప్రతి దాడులు, హెచ్చరికలు బెదిరింపుల మధ్య మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తత పెరిగిపోతోంది. హర్మూజ్ జలసంధిని 48 గంటలలో తెరవకపోతే ఇరాన్‌లోని విద్యుత్ వ్యవస్థలను నేలమట్టం చేస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన బెదిరింపులపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ తీర ప్రాంతాలు, దీవుల జోలికి వస్తే హర్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేస్తామని, పర్షియలన్ గల్ఫ్ అంతటా సముద్ర మందుపాతరలు అమరుస్తామని, మధ్యప్రాచ్యంలోని ఇంధన, జల మౌలిక సదుపాయాలపై ప్రతీకార దాడులు చేస్తానని ఇరాన్ రక్షణ మండలి హెచ్చరించింది. మరోవైపు ఇజ్రాయిల్‌లోని విద్యుత్ ప్లాంట్లను పేల్చివేస్తామని, మధ్యప్రాచ్యంలోని అమెరికా స్థావరాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న వ్యవస్థలను నాశనం చేస్తామని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) తెలిపింది.

**టెహ్రాన్ మౌలిక సదుపాయాలపై ఇజ్రాయిల్ దాడులు**

టెహ్రాన్‌లోని మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ పెద్ద ఎత్తున దాడులు జరిపింది. టెహ్రాన్ మధ్య, దక్షిణ, తూర్పు ప్రాంతాలలో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. రాజధానిలోని సయ్యద్ షిరాజీ హైవేపై ఉన్న ఎలక్ట్రానిక్స్ కేంద్రంపై ఇజ్రాయిల్ సేనలు దాడి చేశాయి. టెహ్రాన్‌కు పశ్చిమాన ఉన్న కరజ్ నగరంపై జరిగిన వైమానిక దాడి కారణంగా ఆకాశంలో దట్టమైన పొగలు అలముకున్నాయి. బందర్ అబ్బాస్ నగరంలోని ఇరాన్ రేడియో స్టేషన్‌కు చెందిన వంద కిలోవాట్ల ఏఎం ట్రాన్స్‌మిటర్‌పై అమెరికా-ఇజ్రాయిల్ జరిపిన దాడిలో ఓ వ్యక్తి మరణించాడు. వాయవ్య ప్రాంతంలోని ఉర్మియా నగరంపై జరిగిన వైమానిక దాడులలో అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద చిక్కుబడిన వారిని కాపాడేందుకు సహాయ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. క్వామ్ రాష్ట్రంలో ఉన్న టర్బైన్ ఇంజిన్ ఉత్పత్తి కేంద్రంపై దాడి చేశామని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. ఐఆర్‌జీసీకి కావాల్సిన డ్రోన్లు, విమానాల విడిభాగాలను ఇక్కడ తయారు చేస్తారు.

# కొత్త చరిత్ర సృష్టిస్తుందా?

కోల్‌కతా: రాజకీయ చైతన్యానికి పశ్చిమ బెంగాల్ ప్రజలు ప్రతీకలు. అటువంటి రాష్ట్రానికే దిక్సూచీ వంటి నియోజకవర్గాల్లో అత్యంత కీలకమైనది భవానీపూర్. కాంగ్రెస్ పార్టీకి నాలుగు దశాబ్దాలపాటు కంచుకోటగా ఉన్న ఆ స్థానం...తర్వాత కాలంలో మారిన రాజకీయ పరిణామాలకు సంకేతమా అన్నట్లు తృణమూల్ కాంగ్రెస్‌కు రక్షణ దుర్గంగా మారింది. టీఎంసీ అధినాయకురాలు మమతా బెనర్జీకి అత్యంత సురక్షితమైన, విశ్వసనీయమైన స్థావరమైంది. అటువంటి కీలక నియోజకవర్గం ఈ దఫా హోరాహోరీ పోరుకు వేదికగా మారనుంది. రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవాలని విశ్వప్రయత్నం చేస్తోన్న భాజపా...తమ అగ్రనేత సువేందు అధికారిని మమతపై నేరుగా పోటీకి దించాలని నిర్ణయించడంతో ఈసారి అందరి దృష్టి భవానీపూర్‌పైనే కేంద్రీకృతమైంది.

**40ఏళ్ల కనుమరుగు తర్వాత..**

దక్షిణ కోల్‌కతా పరిధి భవానీపూర్‌లో స్వాతంత్ర్యం అనంతరం దశాబ్దాలపాటు కాంగ్రెస్‌దే హవా. రాష్ట్రంలోని దిగ్గజ నేతలకు సొంత నియోజకవర్గంగా మారింది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సిద్ధార్థశంకర్ రే కాంగ్రెస్ అభ్యర్థిగానూ ఆ తర్వాత స్వతంత్ర అభ్యర్థిగానూ ఇక్కడి నుంచే పోటీ చేశారు. దిగ్గజ కాంగ్రెస్ నేతలైన మీరా దాస్ గుప్తా, రతిన్ తాలూక్దార్ తదితరులు కూడా ఇక్కడి నుంచే అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించడంతో ఆ పార్టీకి గట్టిపట్టున్న అర్బన్ నియోజకవర్గాల్లో భవానీపూర్ ఒకటిగా నిలిచింది. ఈ స్థానం పేరును కాళీఘాట్‌గా మార్చిన 1969లో మాత్రమే సీపీఐ(ఎం) అభ్యర్థి సుధాన్ గుప్తా ఇక్కడ గెలుపొందారు.

# ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌తో ఉత్తరాంధ్రలో కొత్త శకం

ఆర్సెలార్ మిత్తల్, నిప్పన్ స్టీల్ ఇండియా ఉక్కు కర్మాగారం నిర్మాణంతో ఉత్తరాంధ్రలో కొత్త చరిత్ర సృష్టించబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో సోమవారం ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. విశాఖ ఉక్కు మన ఆత్మగౌరవమైతే.. ఆర్సెలార్ మిత్తల్ నిప్పన్ స్టీల్ పరిశ్రమ మన సత్తాను ప్రపంచానికి చాటి చెబుతుందన్నారు. ఈ రెండు ఉక్కు పరిశ్రమలు దేశ ఉక్కు రంగంలో రాష్ట్రాన్ని ఉన్నతస్థాయిలో నిలుపుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఉక్కు నగరానికి ఈరోజు పునాదిరాయి వేశామని, దీంతో ఈ ప్రాంత రూపురేఖలు మారతాయని చెప్పారు. రవాణా, హోటల్ పరిశ్రమ, రియల్ ఎస్టేట్, విద్య, వైద్య తదితర రంగాల్లో అనేక మార్పులు వస్తాయన్నారు. ఎలాంటి ఇబ్బందీ పెట్టకుండా ఈ ప్రాజెక్టుకు భూములిచ్చేందుకు ముందుకొచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమ నిర్మాణానికి స్థానిక ప్రజలు పూర్తిగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలివీ..

**రెండు దశల్లో నిర్మాణం**

5,465 ఎకరాల్లో నిర్మించనున్న ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగాలొస్తాయి. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తాం. మొదటి దశలో ఏడాదికి 7.3 మిలియన్ టన్నులు (ఎంటీపీఏ), రెండో దశలో 10.5 ఎంటీపీఏ ఉత్పత్తి జరుగుతుంది. 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్ట్‌ఫర్నేస్, డిసెంబరు నాటికి రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ అందుబాటులోకి వస్తాయి. స్టీల్‌ప్లాంట్‌తో పాటు 50 ఎంటీపీఏ సామర్థ్యంతో క్యాప్టివ్ పోర్టు రానుంది.

# అనుమానంతో భార్యను హతమార్చిన భర్త..

* బైక్‌పై శవాన్ని తీసుకెళ్లి పొలాల్లో పడేసిన నిందితుడు!
* హత్య వివరాలు వెల్లడించిన ఏసీపీ.



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : అనుమానం పెనుభూతమై ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. తన మాట వినడం లేదని, ఇతరులతో చనువుగా ఉంటోందని భార్యను అత్యంత కిరాతకంగా చంపిన ఘటన షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. హత్య చేసిన అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని బైక్‌పై తరలించి పొలాల్లో పడేసిన నిందితుడిని పోలీసులు గంటల వ్యవధిలోనే అరెస్టు చేశారు. హత్య కు సంబంధించిన పూర్తి వివరాలు సోమవారం షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఏసిపి లక్ష్మీనారాయణ మీడియాకు వివరించారు. మహబూబ్‌నగర్ జిల్లా వీరన్నపేటకు చెందిన పానుగంటి నర్సింలు (31), అదే ప్రాంతానికి చెందిన శోభ అలియాస్ శోభారాణి (33)ని నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కుమార్తె మమత ఉంది. శోభకు అంతకుముందే వివాహమై ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలం సజావుగా సాగిన వీరి సంసారంలో నర్సింలు మద్యానికి బానిస కావడంతో గొడవలు మొదలయ్యాయి. వేధింపులు భరించలేక శోభ తన కుమార్తెతో కలిసి రంగారెడ్డిగూడెంలోని తన తల్లి వద్ద నివసిస్తోంది. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న నర్సింలు, ఎలాగైనా ఆమెను అంతమొందించాలని పథకం వేశాడు. మాయమాటలతో పిలిపించి.. ఈ నెల 21న నీ కొడుక్కి సైకిల్ ఇప్పిస్తాను, మహబూబ్‌నగర్‌కు రా అని నర్సింలు శోభను నమ్మించి పిలిపించాడు. ఆమె తన కుమార్తెతో కలిసి రాగా, తన గదికి తీసుకెళ్లి మద్యం సేవించాడు. అక్కడ మళ్లీ గొడవ జరగడంతో, ముందే సిద్ధం చేసుకున్న గ్రానైట్ రాయితో ఆమె తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. హత్య చేసిన అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా రక్తపు మరకలను శుభ్రం చేశాడు. అర్ధరాత్రి సమయంలో శోభ మృతదేహాన్ని మూటకట్టి, బైక్ పెట్రోల్ ట్యాంక్‌పై పెట్టుకున్నాడు. దానిపైనే తన మూడేళ్ల కుమార్తెను కూర్చోబెట్టుకుని, రంగారెడ్డిగూడెం శివారులోని ఓ పొలం గట్టున పడేసి పరారయ్యాడు. మరుసటి రోజు ఉదయం స్థానికుల సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి సాంకేతిక ఆధారాలతో నిందితుడి కదలికలను గమనించి, సోమవారం ఉదయం లింగంపల్లిలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అతని వద్ద నుంచి ఒక సెల్ ఫోన్, హత్యకు వాడిన రాయి, రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మీడియా కు వివరించారు.నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ కె. సీతారాం, ఎస్ఐలు సుశీల, శ్రీకాంత్, రాజేశ్వర్, శివరెడ్డిలను ఫ్యూచర్ సిటీ కమిషనర్, షాద్‌నగర్ డీసీపీ అభినందించారు.

## ఖమ్మం జిల్లాలో ఘనంగా ఉరితాడును ముద్దాడిన వీరులకు షాహీద్ దివస్



ప్రజాస్ఫూర్తి/ఖమ్మం జిల్లా : భగత్ సింగ్,సుఖ్ దేవ్, రాజ్ గురు,భారత స్వాతంత్ర సమరంలో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన విప్లవ వీరులు.1931 మార్చి 23 న సాండర్స్ హత్య, అసెంబ్లీ బాంబు కేసులో బ్రిటిష్ ప్రభుత్వం వీరికి ఉరిశిక్ష విధించింది. విప్లవకారుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏటా మార్చి 23 న అమరవీరుల దినోత్సవం.దేశభక్తికి చిహ్నంగా ఘనంగా జరుపుకుంటారు.

## కాంగ్రెస్ పార్టీ ఓబిసి తెలంగాణ చైర్మన్ గా వీర్లపల్లి శంకర్ ప్రమాణస్వీకారం



ప్రజాస్ఫూర్తి-షాద్ నగర్ : గాంధీభవన్ లో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ గా కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ను కాంగ్రెస్ మైనారిటీ సీనియర్ నాయకులు ఇబ్రహీం సన్మానించి సత్కరించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

* దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ఈనెల 27న జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం, 28న నిర్వహించనున్న మహా పట్టాభిషేకం కార్యక్రమాలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అత్యంత ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని, ఇందులో భాగంగా ఈనెల 27వ తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించబడుతుందని చెప్పారు. దేవాలయ స్థానాచారులతో చర్చించి శాస్త్రోక్తంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలని, ముఖ్యమంత్రి దైవ దర్శనం అనంతరం భూమి పూజ కార్యక్రమం పూర్తి చేసి, తదనంతరం మిథిలా స్టేడియంలో జరిగే కళ్యాణ మహోత్సవానికి హాజరయ్యేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని వివరించారు. మిథిలా స్టేడియంలో పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, వివిఐపీలు, వీఐపీలు పాల్గొనే అవకాశం ఉన్నందున ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని, వారికి ప్రత్యేక లైజనింగ్ అధికారులను నియమించాలని సూచించారు. భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భూముల వివరాలు, దేవస్థానంలో ఉన్న సమస్యలు, భద్రాచలం పట్టణానికి సంబంధించిన కీలక అంశాలపై పూర్తి సమగ్ర సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ శ్రీరామనవమి, మహా పట్టాభిషేకం, ఆలయ అభివృద్ధి పనుల భూమి పూజ కార్యక్రమాల నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి అన్ని అంశాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, సిపిఓ సంజీవరావు, దేవస్థాన ఈ ఈ రవీందర్, తాసిల్దార్ వెంకటరమణ, పంచాయతీ ఈ ఓ శ్రీనివాసరావు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలు ముగిసే వరకు వసతుల కల్పనలో ఎలాంటి లోపం ఉండొద్దు

* కలెక్టర్ బి చంద్రశేఖర్



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: పదవ తరగతి పరీక్షలు ముగిసేవరకు కేంద్రాలలో వసతుల కల్పనలో ఎలాంటి లోపం ఉండకూడదని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల ఆవరణలో ఉన్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పరీక్షా కేంద్రాలలో అన్ని వసతులు ఎప్పటిలాగే ఉండాలని,ప్రత్యేకించి తాగునీరు, శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,టాయ్ లెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని అధికారులకు చెప్పారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా కుండలలో తాగునీరు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి భద్రత ఏర్పాటు చేయాలని తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలని,పూర్తి స్థాయిలో తనిఖీ తర్వాతే విద్యార్థులను పరీక్ష కేంద్రం లోకి పంపించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థుల హాజరు,తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స లో భాగంగా ఏ ఎన్ ఎం తో మాట్లాడారు.వేసవిని దృష్టిలో ఉంచుకొని ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

## పరీక్షా కేంద్ర్రాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం : పదవ తరగతి వార్షిక పరీక్షలు జరుగుతున్న కేంద్రాలను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని సింగరేణి కాలరీస్ హై స్కూల్, సెయింట్ మేరీస్ హై స్కూల్, బాబు క్యాంపు పీఎం శ్రీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాట్లను పరిశీలించారు.పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుగుతున్నాయా అన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యార్థులకు త్రాగునీరు, విద్యుత్, సరైన కూర్చునే సదుపాయాలు, గదుల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించి అవసరమైన చోట్ల వెంటనే మెరుగులు చేర్చాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయగల వాతావరణం కల్పించాలన్నారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఎలాంటి అక్రమాలు, మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఇన్విజిలేటర్లు, సిబ్బంది తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. పరీక్షల పారదర్శకతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 (బి) అమలు, భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తు అంశాలను సమీక్షించారు. కేంద్రాల వద్ద అనవసరంగా గుంపులు గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని, బయటి వ్యక్తుల ప్రవేశాన్ని నియంత్రించాలని అధికారులకు సూచించారు.ఇక విద్యార్థుల హాజరు శాతంపై వివరాలు అడిగి తెలుసుకోగా, అన్ని కేంద్రాల్లో 100 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు, పెండింగ్ ఫైళ్ళను తక్షణమే పరిష్కరించాలి

* జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్,



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో *అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ అన్ని విభాగాల జిల్లా అధికారులు, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి లతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్‌స్వయంగా గూగుల్ మీట్ ద్వారా సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా ఫిర్యాదులు తీసుకొని వారి యొక్క వినతులను సవివరంగా విని సంబంధిత విభాగాల అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్ ఫైళ్లను, ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి తక్షణమే క్లియర్ చేయాలని, కార్యాలయాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు జవాబుదారీ తరంగా ఉంటూ సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన వసతి గృహాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పిల్లలతో కలిసి బ్రేక్ ఫాస్ట్ ,భోజనం, డిన్నర్ చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు,తహసిల్దారులు,కచ్చితంగా వసతి గృహాలను తనిఖీ చేసి, కామన్ డైట్ మెనూ, త్రాగునీరు, దుస్తులు, తదితర సౌకర్యాలను కచ్చితంగా తనిఖీ చేయాలని, వసతి గృహాలలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేసి అందుకు సంబంధించిన "కీ "సంబంధిత అధికారి వద్ద ఉంచుకోవాలని సూచించారు. ప్రతి మెనూ గూగుల్ ఫోటో, జియో ట్యాగింగ్, తెప్పించుకోవాలని, షెడ్యూల్ ప్రకారం ఆర్బిఎస్కే, వైద్య క్యాంపుల ద్వారా పిల్లలకు భోజనం సిద్ధం చేసే సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లో ఫుడ్ పాయిజన్ కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ఆవుల పద్మ తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినదని అధికారులు తెలియజేయగానే తమకు ఉన్న పాత ఇల్లును కూల్చివేశామని కానీ ఇప్పుడు అది వేరే స్టేజీ లో ఉందని మంజూరు చేయలేదు తమకు పూర్వం ఎటువంటి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని తమ సమస్య పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.మహబూబాబాద్ మండలం, శనిగపురం గ్రామానికి చెందిన ఉప్పలయ్య తనకు శనిగపురం గ్రామ శివారులో ఉన్న సర్వే నెంబర్లలోని భూమిని ఆన్ లైన్ చేసి తనకు కొత్త పట్టా పాసుపుస్తకము ఇప్పించగలరని అన్నారు. మహబూబాబాద్ మండలం, పర్వతగిరి గ్రామానికి చెందిన కె.వెంకటాద్రి 2023 సంవత్సరంలో ప్రమాదం జరిగి కుడి కాలు, చేయి విరిగిందని తనకు సదరం ద్వారా జారీచేసిన సర్టిఫికేట్ ద్వారా వికాలాంగుల పించను ఇప్పించగలరని కోరారు.గార్ల మండల కేంద్రానికి చెందిన సుందర్ తాను పుట్టుకతోనే వికాలాంగుడినని తాను చిన్నపాటి ఉద్యోగంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉన్నదని తనకు గార్ల మండల కేంద్రంలో సి.ఎస్.సి కేంద్రానికి అనుమతించి తన కుటుంబం ఆర్థికంగా తోడ్పాటు అందించాలని కోరారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో వచ్చిన ( 146 ) దరఖాస్తులను సంబందిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం,అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో బీసీలకు 'మొండిచేయి'.. ఈసీఐఎల్ చౌరస్తాలో టీఆర్పీ ధర్నా



ప్రజాస్ఫూర్తి, కాప్రా : తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 202627 బడ్జెట్ సామాన్య ప్రజలకు, ముఖ్యంగా బీసీ వర్గాలకు ఎలాంటి ప్రయోజనం కలిగించలేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నేతలు విమర్శించారు. పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు సోమవారం కాప్రా సర్కిల్ పరిధిలోని ఈసీఐఎల్ చౌరస్తాలో జిల్లా అధ్యక్షుడు పనగట్ల చక్రపాణి గౌడ్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు.ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కార్యకర్తలు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుదగాని హరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 'కామారెడ్డి డిక్లరేషన్' హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. బీసీ సంక్షేమానికి సంవత్సరానికి రూ.20,000 కోట్లు కేటాయిస్తామని చెప్పి, ఇప్పుడు బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం వంచనకే నిదర్శనమని విమర్శించారు. బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధతపై ప్రభుత్వం మౌనం వహించడం ఆశ్చర్యకరమన్నారు. జిల్లా అధ్యక్షుడు పనగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 చెల్లించే మహాలక్ష్మి పథకం, నిరుద్యోగ భృతి వంటి హామీలకు సరైన నిధులు కేటాయించలేదని ఆరోపించారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సింగం అరుణ్ పటేల్ మాట్లాడుతూ, ప్రభుత్వం తన వైఖరిని మార్చి సవరించిన బడ్జెట్‌లో బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## దేశాన్ని విముక్తి చేసిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవకారుడు భగత్ సింగ్

* సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నాగయ్య



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: బ్రిటీష్ సామ్రాజ్యవాదులను తరిమికొట్టి, దేశాన్ని విముక్తి చేసిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవకారుడు భగత్ సింగ్.అని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య అన్నారు. సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పెరుమాండ్ల జగన్నాథం భవన్ లో పట్టణ కార్యదర్శి సీతారాం నాయక్ ఆధ్వర్యంలో జరిగిన భగత్ సింగ్ వర్ధంతి సభను ఉద్దేశించి సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య పాల్గొని మాట్లాడుతూ భగత్ సింగ్ నాటి బ్రిటీష్ సామ్రాజ్యవాదం, వలస పాలనను ఎదిరించి దేశ ప్రజలందరినీ ఒక్కతాటిపై నిలిపి వీరోచితంగా పోరాడాన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్, సామ్రాజ్యవాదం మూర్ధాబాద్ అని తను ఇచ్చిన నినాదం కోట్లాది మందికి ఎంతో స్ఫూర్తినిచ్చిందని స్వాతంత్ర్య పోరాటాన్ని ముందుకు నడిపిందన్నారు. సామ్రాజ్యాధిపత్యం పై పోరాడి వీర మరణం పొందిన, దేశం గర్వించదగ్గ గొప్ప దేశభక్తుడు సోషలిస్టు విప్లవకారుడు అయిన భగత్ సింగ్ ను దేశంలో స్మరించుకుంటున్నాం అని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ సర్నపు సోమయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టి వెంకన్న,పట్టణ కమిటీ సభ్యులు హేమ నాయక్, బానోత్ వెంకన్న, కుమ్మరి కుంట్ల నాగన్న, వార్డు కౌన్సిలర్ బానోత్ బాబు, తజ్జు, పులిగుజ్జు వెంకన్న, లాలయ్య, గౌని వెంకన్న, బానోత్ ప్రకాష్, శాఖ కార్యదర్శి లు పార్టీ సభ్యులు తదితరులు పాల్గున్నారు.

## పోస్టాఫీస్ సెంటర్‌లో భారీ ట్రాఫిక్ జామ్

– చలాన్లకే పరిమితమైన ట్రాఫిక్ సిబ్బంది
– సిగ్నల్ వ్యవస్థ ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన కూడలి అయిన పోస్టాఫీస్ సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోస్టాఫీస్ సెంటర్‌లోని సింగరేణి స్కూల్, సమీపంలోని సెయింట్ మేరీస్, శివశివాని, చర్చి స్కూల్, చుంచుపల్లి హై స్కూల్స్‌లో 10వ తరగతి పరీక్ష కేంద్రాలు ఉండగా మధ్యాహ్నం పరీక్ష ముగిసిన సమయంలో ఈ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అయితే ఈ ప్రాంతంలో పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు విధులకు వచ్చిన పోలీసులతోపాటు ట్రాఫిక్ సిబ్బంది ఉన్నప్పటికీ వారు ట్రాఫిక్‌ను ఏమాత్రం నియంత్రించలేకపోయారు. ఫలితంగా కొత్తగూడెం నుంచి ఖమ్మం, విజయవాడవైపు రాకపోకలు సాగించే వాహనాలు, బైపాస్‌కు వెళ్లాల్సిన భారీ వాహనాలు నిలిచిపోవడంతో విద్యార్థులతోపాటు ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మిట్టమధ్యాహ్నం కావడంతో ఎండ తీవ్రత కూడా అధికంగా ఉడటంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.సుమారు గంటన్నరకు పైగా ఇదే పరిస్థితి కొనసాగడంతో ట్రాఫిక్ పోలీసుల తీరుపై వాహనదారులు కొంత అసహనం వ్యక్తం చేశారు.

### చలాన్లకే పరిమితమైన ట్రాఫిక్ సిబ్బంది



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌తోపాటు బస్టాండ్, సూపర్‌బజార్, రైతుబజార్, గణేష్ టెంపుల్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగానే తరచూ కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ స్థంభించిపోయే పరిస్థితి ఉందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. పోస్టాఫీస్ సెంటర్‌లో ఉదయం పాఠశాలలకు వెళ్లేటప్పుడు, సాయంత్రం పాఠశాలలు విడిచిన సమయంలో, సూపర్‌బజార్ సెంటర్ వద్ద రైళ్లు వచ్చినప్పుడు ఆటోల కారణంగా ట్రాఫిక్ నిలిచిపోతుందని స్థానికులు చెప్తున్నారు. అయితే పోస్టాఫీస్, బస్టాండ్ సెంటర్‌లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ వాటిని ఆన్ చేయకపోవడం గమనార్హం. సాంకేతిక కారణాలు చూపుతూ సిగ్నల్స్‌ను ఆన్ చేయడంలేదని చెప్తున్నప్పటికీ వాటికి మరమ్మతులు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. అయితే ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన సిబ్బంది కూడా ఆయా సెంటర్లలో చలాన్లు విధించేందుకు ఫొటోలు తీయడం మినహా ఎలాంటి విధులు నిర్వహించడంలేదని పలువురు వాహనదారులు విమర్శిస్తున్నారు. కేవలం ఫొటోలు తీసి చలాన్లు వేస్తూ వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టిసారించడంలేదని, అధికారులు సైతం చలాన్లకే ప్రాధాన్యమిస్తున్నారు మినహా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకోవడంలేదని అంటున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి కొత్తగూడెం పట్టణంలో ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సిబ్బందిని నియమించడంతోపాటు చలాన్లపై కాకుండా ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్‌ను నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.

# శ్రీరాం నగర్ 2బిహెచ్‌కే సమస్యలు పరిష్కరించాలి

* **ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా సర్కిల్ పరిధిలోని శ్రీరాం నగర్ 2బిహెచ్‌కే కాలనీలో మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం సమర్పించారు. కాలనీలో వాణిజ్య సముదాయాలను వేలం వేయకుండా కిరాయికి ఇవ్వాలని, జీరో కరెంట్ బిల్లు అమలు చేయాలని, బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని, 117 బస్సును కాలనీ వరకు పొడిగించాలని కోరారు. భవనాల మరమ్మతులు, లిఫ్టులు, నీటి లీకేజీలు, వీధి దీపాలు, ప్రహరీ గోడ వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.కలెక్టర్ సమస్యలపై స్పందించి సంబంధిత అధికారులకు సూచనలు చేసినట్లు లబ్ధిదారులు తెలిపారు.

# సాయిసుధీర్ కాలేజీలో 'ఇంపాక్ట్ – సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : సాయిసుధీర్ డిగ్రీ & పీజీ కాలేజీలో రీసెర్చ్ రూట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "ఇంపాక్ట్ - సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ వి. బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన ఇన్నోవేటివ్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయని, మరింతగా పరిశోధనలో ముందుకు రావాలని సూచించారు.ఈ సందర్భంగా కాలేజీ మేనేజ్‌మెంట్ , రీసెర్చ్ రూట్స్ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదిరింది. కార్యక్రమంలో పలువురు అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలకు రూ.18 వేలు వేతనమివ్వాలి

* **సి.ఐ.టి.యు. ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా**




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: అసెంబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీలకు రూ.18 వేలు వేతనం చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. అనంతరం ఈసం వెంకటమ్మ అధ్యక్షతన జరిగిన సభలో బ్రహ్మచారి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందని, అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని ఆరోపించారు. ఐసీడీఎస్ ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తి కావస్తుందని, పౌష్టికాహారం అందించడంలో, శిశు మరణాలు, బాలింత మరణాలు తగ్గించడంలో, రక్తహీనత పెంపొందించడంలో, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అవగాహన కల్పించడంలో అంగన్వాడీ టీచర్స్ ముఖ్యపాత్ర పోషిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్వాడీలకు రూ. 18 వేలు వేతనం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని, మ్యానిఫెస్టోలో లేని అంశాలను అసెంబ్లీలో చర్చిస్తున్నారని విమర్శించారు. ఈ బడ్జెట్ సమావేశాలలో అయినా అంగన్వాడీల సమస్యలను పరిష్కారించాలని, ఇప్పటికే ఉన్నతాధికారులకు, ఎమ్మెల్యేలకు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని చెప్పారు. పిఎంశ్రీ ప్రైమరీ విద్య మొబైల్ సెంటర్స్ ఎడ్యుకేషన్ పాలసీ తీసుకొచ్చి అంగన్వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని భవిష్యత్తులో అంగన్వాడీలందరూ పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతారని అన్నారు . ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్య, మండల కన్వీనర్ పాయం రాధాకుమారి, రాష్ట్ర కమిటీ సభ్యులు వీరభద్ర, అంగన్వాడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజ్యలక్ష్మి, మరియా, శైలజ, సూరమ్మ, భాను శ్రీ, హేమలత, సోనా, కృష్ణవేణి, జానకమ్మ, శకుంతల, రత్నకుమారి, ఫాతిమా, అరుణ, జయసుధ, రమ్య, సావిత్రి, గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీరే జీవనాధారం కాపాడుకుంట మన ధర్మం

* **సామాజికవేత్త పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : వర్షపు నీరే జీవనాధారం కాపాడుకుంట మన ధర్మం అని సామాజికవేత్త పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ అన్నారు. ప్రపంచ నీటి పొదుపు దినోత్సవ సందర్భంగా సూరారం కాలనీలోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు డ్రాయింగ్ వేయించారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ ఎక్కడ చూసినా కాంక్రీట్ జంగల్ అయిందని నీళ్లు భూమిలోకి పోయే పరిస్థితి లేదన్నారు. నీటిని పొదుపుగా వాడడం మన బాధ్యతని వర్షపు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపినప్పుడే వర్షము నీరు మనకు లభిస్తుందని, లేనిచో 600 అడుగుల వేసిన 6 చుక్కల నీరు రాదని,రక్తం దొరుకుతుందేమో గాని మనకు నీరు దొరకని పరిస్థితి ఏర్పడుతుంది అని అన్నారు. ప్రతి విద్యార్థి నీటిని పొదుపుగా వాడే విధంగా మనం అవలంబించుకోవాలన్నారు. మనము ఒక కేజీ, బియ్యం రైసు పండించాలంటే 250 లీటర్లు నీళ్లు అవసరం, ఇంట్లో ఫంక్షన్ ఉన్నప్పుడు చిన్నపాటి గ్లాసులు వాడాలని పెద్ద గ్లాసులు వాడవద్దని బట్టలు ఉతికిన నీటిని మనం బాత్రూంలో వాడాలన్నారు. అనంతరం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ పుణ్యవతి మాట్లాడుతూ ప్రతి వద్యార్థి, భోజనం తరువాత, ఒకగ్లాస్ లో నీరు తీస్కొని, మొక్కలు యున్నచోట, చేతులు కడుకోవాలి అన్నారు,ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ , నాగరాజు , మహేష్‌బాబు, ఝాన్సీ , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# 'వాహన్' పోర్టల్‌తో సేవలు మరింత సులభతరం: మంత్రి పొన్నం

హైదరాబాద్: 'వన్ నేషన్ వన్ రిజిస్ట్రీ' లక్ష్యంతో దేశవ్యాప్తంగా వాహనాల డేటాను ఒకే చోట చేర్చే 'వాహన్' పోర్టల్‌లో తెలంగాణ చేరింది. ఈ పోర్టల్ అందుబాటులోకి రావడంతో రవాణా శాఖలోని పౌర సేవలు మరింత సులభతరం, పారదర్శకం కానున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ బేగంపేటలోని వరుణ్ మోటార్స్‌లో 'వాహన్' పోర్టల్‌ను సోమవారం లాంఛనంగా ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రెండో వాహనం కొనుగోలు చేసేవారికి 2 శాతం అదనపు పన్ను రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. "రాష్ట్రవ్యాప్తంగా చెక్‌పోస్టులను ఎత్తేశాం. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. ఈవీ విధానం ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలకు తెలంగాణ బ్రాండ్‌గా మారుతుంది. రాష్ట్రంలో రోజుకు సుమారు 1,500 వాహనాలు కొత్తగా రోడ్లపైకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సమాచారాన్ని సమర్థంగా నిర్వహించాలంటే ఆధునిక సాంకేతికత తప్పనిసరి. ఈ అవసరం తీర్చడానికి వాహన్ పోర్టల్ దోహదపడుతుంది. రిజిస్ట్రేషన్, యాజమాన్య బదిలీ, పన్ను చెల్లింపులు వంటి సేవలు ప్రజలకు సులువుగా అందుతాయి" అని మంత్రి తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె అంశంపై స్పందిస్తూ.. "ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాల పునరుద్ధరణ రెండూ విధానపరమైన అంశాలు. అవి మా దృష్టిలో ఉన్నాయి. వాటిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. కార్మికులు సమ్మెకు వెళ్లరని ఆశిస్తున్నాను" అని చెప్పారు.

# పాటతో మొదలైన నా ప్రయాణం..

## సక్సెస్ స్టోరీ మానసి పరేఖ్



సింగింగ్‌తో మొదలైన ఆమె కెరీర్.. యాక్టింగ్‌తో కొత్త మలుపు తీసుకుంది. ఇప్పుడు రెండింటిలోనూ సక్సెస్‌ఫుల్‌గా దూసుకెళ్తోంది. లేటెస్ట్‌గా 'జమ్‌కుడి' అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకొచ్చింది. ఈ సినిమా కోసం ఆమె టైటిల్ ట్రాక్ కూడా పాడింది. ఇంతకీ ఆమె ఎవరంటే... గుజరాతీ యాక్ట్రెస్ మానసి పరేఖ్. "ఇంతకుముందు కూడా నా సినిమాలకు నేను పాడా. 'కచ్ ఎక్స్‌ప్రెస్'లో 'కంగ్రాచ్యులేషన్స్' అనే పాట. నేను నటించిన సినిమాలో పాట కూడా పాడడం చాలా హ్యాపీగా అనిపిస్తుంది" అంటోంది మానసి పరేఖ్. ఆమె సక్సెస్‌ఫుల్ జర్నీ గురించి మరిన్ని ముచ్చట్లు తెలుసుకుందాం.

నేను పుట్టింది గుజరాత్‌లో. పెరిగింది ముంబైలో. కాబట్టి రెండింటితో నాకు చాలా కనెక్షన్ ఉంటుంది. చిన్నప్పటి నుంచే మ్యూజిక్ అంటే ప్యాషన్. దాంతో అప్పుడే పాటలు పాడడంలో శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టా. స్కూల్ ఈవెంట్స్, రియాలిటీ షోలు వంటి వాటిల్లో యాక్టివ్‌గా పార్టిసిపేట్ చేశా. దాంతో మంచి పేరొచ్చింది. ఒకసారి ఒక షోకి సెలక్ట్ అయితే, అక్కడి నుంచి మరో అవకాశం దక్కేది. అలా వరుసగా ఎనిమిది టీవీ షోల్లో పార్టిసిపేట్ చేశా. వాటితోపాటు అడ్వర్టైజ్‌మెంట్స్‌లో కూడా కనిపించేదాన్ని. ఒకసారి ఫేమ్ వచ్చిందంటే.. వాళ్లు ఒక రంగంలోనే కాదు. వివిధ రంగాల్లో తమ టాలెంట్ ప్రూవ్ చేసుకునే అవకాశం కూడా వస్తుంది. నా విషయంలోనూ అదే జరిగింది. హిందీ, గుజరాతీ సినిమాలు, షార్ట్ ఫిల్మ్స్ ద్వారా నటనలోకి అడుగుపెట్టా. నాకు నటనలో నా స్కిల్స్ పెంచుకోవడానికి టీవీ షోలు ఉపయోగపడ్డాయి. అది కాకుండా నేను న్యూయార్క్‌లోని 'లీ స్ట్రాస్‌బర్గ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్'లో

### 20 ఏండ్ల అనుబంధం

టెలివిజన్ ఇండస్ట్రీతో నాకు 20 ఏండ్ల అనుబంధం ఉంది. అక్కడ ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నా. టీవీలో పనిచేసేవాళ్లు ఎలాంటి పరిస్థితుల్లోనైనా తమ పని పూర్తి చేయాల్సి ఉంటుంది. వాళ్ల ఎమోషన్స్ అన్నీ పక్కన పెట్టి నటించాలి. అదెలా ఉంటుందంటే.. మిలిటరీ ట్రైనింగ్‌లా ఉంటుంది అనిపించింది నాకు. ఎన్ని పనులున్నా, ఎలాంటి సమస్యలున్నా ప్రతి రోజూ షూటింగ్‌కి వెళ్లాల్సిందే. ఎలాంటి సిచ్యుయేషన్‌లో అయినా స్థిరంగా ఉండడం టెలివిజన్ నాకు నేర్పించింది. నాకున్న స్కిల్స్‌ను నేను రకరకాలుగా ఉపయోగించుకున్నా. టీవీలో నేను చాలా సవాళ్లు ఎదుర్కొన్నా. నేను 'గులాల్' అనే పాపులర్ షో చేశాను. ఆ షో సెట్ మా ఇంటికి గంటన్నర జర్నీ దూరంలో ఉంటుంది. అంటే, నేను అక్కడికి వెళ్లిరావడానికి జర్నీకి మూడు గంటలు టైం పట్టేది. సెట్లో 14 గంటలు ఉండాల్సి వచ్చేది. మొత్తంగా ప్రతిరోజు నేను 17 గంటలు కష్టపడేదాన్ని. ఏడు గంటలు మాత్రమే నిద్రపోయేదాన్ని. అలా ఒక సంవత్సరం పాటు చేశాను. అయితే, ఆరునెలలు గడిచాక ఒత్తిడి వల్ల హెల్త్ పాడయ్యింది. డాక్టర్ దగ్గరకి వెళ్తే నా ప్రొఫెషన్ గురించి అడిగారు. ఎందుకంటే అప్పటికీ నా కళ్ల చుట్టూ డార్క్ సర్కిల్స్ ఉన్నాయి. కాళ్లు వాచిపోయాయి. చెప్పాలంటే నా ప్రొఫెషన్‌కి నేను ఇలా ఉంటే పనిచేయలేను. అలాంటి సిచ్యుయేషన్‌ని దాటుకుని ఇక్కడి వరకు వచ్చా.

### కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా

వర్క్‌ని, పర్సనల్ లైఫ్‌ని బ్యాలెన్స్ చేయడం చాలా కష్టం అనుకునేదాన్ని. ఇప్పుడు నా ప్రియారిటీలు ఏంటీ? అనేది నాకు తెలుసు కాబట్టి ఆ విధంగా మెయింటెయిన్ చేస్తున్నా. నా వర్క్‌కి ఎంత ఇంపార్టెన్స్ ఇస్తానో, నా కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా. అమ్మ అంటే ఇంట్లో కూర్చుని పిల్లల్ని మాత్రమే చూసుకోవాల్సిన పనిలేదు. నేను సినిమాల్లోకి వచ్చి ఏడున్న ఏండ్లు అవుతుంది. నా కూతురు పుట్టాక, నేను ఏడు సినిమాల్లో నటించా. అంటే, ఏడాదికొక సినిమా చేశా అనుకోవచ్చు. అలా నేను వర్క్, ఫ్యామిలీ రెండింటినీ సమానంగా చూస్తా.

### 'జమ్‌కుడి'.. మర్చిపోలేని సక్సెస్

జమ్‌కుడి సినిమాలో నాది లీడ్ రోల్. అయితే మ్యూజిక్ డైరెక్టర్ ఒక పాట నువ్వు పాడాలని చెప్పారు. పాట అంటే నాకు ఎప్పుడూ ఇష్టమే కాబట్టి ఒప్పుకున్నా. సినిమాలో నటించడం, పాడడం వల్ల నేను క్యారెక్టర్‌కి బాగా కనెక్ట్ అయ్యా. పాటకు ఆడియెన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చూస్తే చాలా హ్యాపీగా అనిపిస్తుంది. గ్లోబల్‌గా వైరల్ అవ్వడం మరింత ఉత్సాహాన్నిస్తోంది. ఇవన్నీ చేయగలుగుతున్నా కాబట్టి నా జర్నీ సంతృప్తికరంగా ఉంది. ఈ సినిమాని మా ఆయన పార్థివ్ గోహిల్ ప్రొడ్యూస్ చేశారు. తను నాలాగే యాక్టర్, సింగర్ కూడా. ఈ సినిమా కథ వినప్పుడే నా క్యారెక్టర్ డిసైడ్ చేశారు. ఆ సినిమా హిట్ అవుతుంది అనుకున్నాం. కానీ గుజరాతీ సినిమాల్లో ఈ ఏడాది బెస్ట్‌గా నిలుస్తుంది అనుకోలేదు. పది రోజుల్లో 8.5 కోట్లు కలెక్ట్ చేసింది. గుజరాతీ సినిమా గొప్పదనం ఏంటో నిరూపించింది అని గర్వంగా చెప్తా.

## బ్యూటీ

# ముఖ సౌందర్యం కోసం..





### కీరా – అలోవెరాతో..

ఒక టేబుల్ స్పూన్ అలోవెరా జెల్‌లో పావు టీస్పూన్ కీరదోస తురుము వేసి బాగా కలపాలి. ఆ ప్యాక్‌ని ముఖం, మెడ భాగాలకు పూసుకోవాలి. పావుగంట తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కుంటే కాంతివంతంగా ఉంటుంది.



### పాలు–తేనెలతో..

ఒక టీస్పూన్ తేనెలో రెండు టీస్పూన్లు పచ్చి పాలు కలపాలి. ఆ రెండూ బాగా మిక్స్ అయ్యేలా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి రెండు లేదా మూడు నిమిషాలు మర్దన చేయాలి. ఆ తర్వాత గోరు వెచ్చని నీళ్లతో ముఖాన్ని కడగాలి. పాలు, తేనెల ఫేస్‌వాష్ వాడితే స్కిన్ కాంతివంతంగా మారుతుంది. జిడ్డు తొలగిపోతుంది. సెన్సిటివ్ స్కిన్ ఉన్న వాళ్లకు ఇది చాలా బాగా పనిచేస్తుంది.

# తమిళనాట ఎన్డీయే సీట్ల సర్దుబాటు ఖరారు.. భాజపాకు ఎన్నంటే!

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. మరో వారం రోజుల్లో నామినేషన్ల ప్రక్రియ మొదలుకానుంది. ఈ క్రమంలోనే ఎన్డీయే కూటమిలోని భాజపా సహా కీలక భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల పంపకం ఒప్పందాన్ని అన్నాడీఎంకే ఖరారు చేసింది. భాజపాకు 27 సీట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. పట్టలి మక్కల్ కట్చి (పీఎంకే)కి 18, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే)కు 11 స్థానాలు కేటాయించింది. భాజపా నేత, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, పీఎంకే అగ్రనేత అన్బుమణి రామ్‌దాస్, ఏఎంఎంకే చీఫ్ టీటీవీ దినకరన్ తదితరుల సమక్షంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి సీట్ల పంపకాల వివరాలు ప్రకటించారు. గత ఎన్నికలతో పోలిస్తే కాషాయ పార్టీ ఈసారి అదనంగా ఏడు స్థానాల్లో పోటీ చేయనుంది. మరోవైపు అధికార డీఎంకే.. కాంగ్రెస్‌కు 28 సీట్లను కేటాయిస్తూ ఇప్పటికే ఒప్పందాన్ని ఖరారు



చేసింది. 2021తో పోలిస్తే మూడు సీట్లు ఎక్కువగా కేటాయించింది. సీపీఐకి ఐదు, ఎండీఎంకేకు నాలుగు, కేఎండీకే, ఐయూఎంఎల్, ఎంఎంకేలకు రెండు సీట్ల చొప్పున ఇచ్చింది. సీపీఎం, డీఎండీకే, వీసీకే తదితర పార్టీలతో సర్దుబాటు ఖరారు చేసుకునే అవకాశం ఉంది. తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఏప్రిల్ 23న పోలింగ్ నిర్వహించనున్నారు. మే 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

## గొలుసులతో బంధించి..
# చిత్రహింసలకు గురిచేసి

రాయగడ పట్టణం: ఇనుపరాడ్డును దొంగిలించాడన్న ఆరోపణలతో ఓ వ్యక్తిని గొలుసులతో కట్టేసి, చీకటి గదిలో బంధించిన అమానవీయ ఘటన ఒడిశాలోని కేంఝర్‌లో వెలుగులోకి వచ్చింది. ఏకంగా నాలుగు నెలల పాటు చిత్రహింసలకు గురి చేసినట్లు తెలుస్తోంది. పోలీసుల చొరవతో ఎట్టకేలకు బాధితుడికి ఆదివారం విముక్తి లభించింది. పోలీసుల కథనం మేరకు... ఆనందపూర్



పోలీస్ స్టేషన్ పరిధి పురునాఘాటి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. క్షీరద్ ప్రధాన్ అనే వ్యక్తి ఇనుపరాడ్డు దొంగిలించాడని ఆరోపిస్తూ శివరాజ్ అతడిని బంధించాడు. అంతేకాకుండా సోదరుడు అనిత్‌తో కలిసి క్షీరద్‌ను చిత్రహింసలకు గురిచేశాడు. నాలుగు రోజులకోసారి భోజనం పెడుతూ.. క్షీరద్‌పై దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాధితుడిని విడుదల చేసి.. ఆస్పత్రికి తరలించారు. అతడు కోలుకొని ఫిర్యాదు చేసిన తర్వాత నిందితులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.




## దిల్లీ పేలుడు కేసు..
# జమ్మూకశ్మీర్‌లో ఎన్ఐఏ సోదాలు

శ్రీనగర్: దిల్లీ పేలుడు కేసు దర్యాప్తులో భాగంగా జాతీయ దర్యాప్తు సంస్థ జమ్మూకశ్మీర్‌లో సోదాలు నిర్వహిస్తోంది. సోమవారం తెల్లవారుజామునుంచి తనిఖీలు చేపట్టింది. హంద్వారాలోని ఓ వ్యాపారి నివాసంలో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ కేసులో అరెస్టైన వైద్యులకు.. ఆయుధాలు సరఫరా చేసిన వ్యక్తులతో అతడికి సంబంధం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే పలు కీలక పత్రాలతో పాటు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల మొదట్లో పుల్వామా, కుల్గాం, షోపియాన్, బారాముల్లా, కుప్వాడా జిల్లాల్లో సోదాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కాగా ఇరాన్ మాజీ సుప్రీం ఖమేనీ మృతికి వ్యతిరేకంగా జమ్మూకశ్మీర్‌లో పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతుండడంతో దర్యాప్తునకు ఆటంకం కలిగిందన్నారు. దిల్లీ పేలుడులో చనిపోయిన సూసైడ్ బాంబర్ ఉమర్ నబీకి ఆయుధాలు సరఫరా చేసిన మరో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామన్నారు. వీరు స్లీపర్ సెల్స్‌గా ఉంటూ.. ఉగ్ర సంస్థలకు సమాచారం చేరవేస్తున్నట్లు తెలిపారు. వీరి అరెస్టుతో ఈ కేసులో మొత్తం అరెస్టు అయినవారి సంఖ్య 11కి చేరిందన్నారు.

## కుప్పకూలిన సైనిక విమానం..
# కొలంబియాలో ఘోరం!

దక్షిణ అమెరికా దేశమైన కొలంబియాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సైన్యానికి చెందిన ఓ విమానం.. ప్యూర్టో లెగుయిజామో పట్టణం నుంచి టేకాఫ్ అవుతున్న సమయంలో కూలిపోయింది. ఆ సమయంలో విమానంలో 100 మందికిపైగా సిబ్బంది ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. విమానంలో బలగాలను తరలిస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుందని, అనేక మంది మృతి చెందినట్లు భావిస్తున్నామని కొలంబియా



రక్షణ మంత్రి పెడ్రో సాంచెజ్ తెలిపారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. మృతుల సంఖ్య, ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని ఆయన 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.

# క్యూనెట్ కేసులో 32 మంది అరెస్టు.. ఎక్కువమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే: సజ్జనార్

క్యూనెట్ సంస్థ మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట కోట్లాది రూపాయల మోసానికి పాల్పడింది. ఈ కేసులో సీసీఎస్ పోలీసులు 32 మంది నిందితులను అరెస్టు చేశారు. క్యూనెట్ కేసుకు సంబంధించి హైదరాబాద్ సీపీ సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ, మల్టీలెవల్ మార్కెటింగ్ పేరిట క్యూనెట్ మోసం చేస్తోందని, మూడు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించామని ఆయన తెలిపారు. అరెస్టైన 32 మందిలో 11 మంది మహిళలు ఉన్నట్లు వెల్లడించారు. అరెస్టైన నిందితుల నుంచి భారీగా ఒప్పంద పత్రాలు, లాప్‌టాప్‌లు, వస్తువులు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు ముప్పై బృందాలుగా విడిపోయి ఆపరేషన్ నిర్వహించినట్లు వెల్లడించారు. క్యూనెట్ నిర్వాహకులు 1998 నుంచి వివిధ రకాల పేర్లతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 22 మంది బాధితులు తెలిపిన వివరాల మేరకు కేసులు నమోదు చేశామని అన్నారు. క్యూనెట్ కీలక ఆధారాల కోసం 30 టీమ్‌లతో ఈ కేసును ఛేదించినట్లు తెలిపారు. సిద్దిపేటకు చెందిన హరికృష్ణ రూ.5 లక్షల మేర మోసపోయారని, ఆయన ఫిర్యాదుతో ఈ సంస్థ కార్యకలాపాలపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. వెల్‌నెస్ ప్రొడక్ట్స్, బిస్కట్లు, హెల్త్ ఫుడ్స్ పేరిట ప్రజల్లోకి వెళుతూ మోసం





చేస్తున్నట్లు గుర్తించామని అన్నారు. ఇష్టపూర్వకంగానే సంస్థలో చేరుతున్నట్లు ముందుగానే బాండ్ పేపర్‌పై రాయించుకుని క్యూనెట్‌లోకి తీసుకుంటున్నారని తెలిపారు. అరెస్టైన వారిలో ఎక్కువమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నమోదైన 4 కేసుల్లో 11 మంది బాధితులకు దాదాపు రూ.75 లక్షల నష్టం జరిగినట్లు గుర్తించామని అన్నారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని తెలిపారు. ఇలాంటి పథకాల్లో చేరడం, చేర్పించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇంకా బాధితులు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నెల రోజులుగా క్యూనెట్ సంస్థపై దర్యాప్తు చేసి, పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించి నిందితులను అరెస్టు చేసినట్లు సజ్జనార్ వెల్లడించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు.

# ఈసీ లేఖపై భాజపా 'సీల్'.. కేరళ సీఈవో కార్యాలయం క్లారిటీ

ఎన్నికల సంఘానికి సంబంధించిన లేఖపై భాజపా ముద్ర ఉండటం కేరళలో దుమారం రేపింది. సంబంధిత పత్రాన్ని సీపీఎం 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. అయితే, ఇది సిబ్బంది చేసిన పొరపాటు మాత్రమేనని, వెంటనే సరిదిద్దామని కేరళ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై విచారణ పూర్తయ్యే వరకు ఓ అధికారిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపింది. ''ఎన్నికల సంఘం, భాజపా.. ఈ రెండింటినీ ఒకే అధికార శక్తి నియంత్రిస్తోందన్నది రహస్యమేమీ కాదు. ఇప్పుడు ముద్రలు కూడా మారిపోతున్నాయి. ఎన్నికల సంఘం లెటర్‌పై భాజపా (BJP) సీల్ కనిపిస్తోంది. ఇతర పార్టీలకూ ఈ లెటర్ అందింది'' అని సీపీఎం విమర్శించింది. కాంగ్రెస్ సైతం.. భాజపా కార్యాలయం నుంచి ఎన్నికల సంఘం పనిచేస్తోందా? ఆ పార్టీ



ELECTION COMMISSION OF INDIA
Nirvachan Sadan, Ashoka Road, New Delhi -110 001

No. 3/4/2019/SDR/Vol-I — Dated: 19th March, 2019

To,
The Chief Electoral Officers of All States and UTs

Subject:- FAQs on Criminal Antecedents, if any, of a candidate and its publicity in pursuance of Hon'ble Supreme Court Judgment dated 25/09/2018 in W.P.(C) No. 536 of 2011- regarding.

Sir/Madam,

I am directed to invite your reference to the Commission's directions in letter of even No. dated 10/10/2018 issued in pursuance of Hon'ble Supreme Court Judgment dated 25/09/2018 in W.P.(C) No. 536 of 2011. In view of the various queries raised in this regard, a set of FAQs and clarifications in this regard is enclosed.

2. The FAQs may be circulated to all DEOs, Returning Officers, officers connected to elections and the Political Parties based in your State, for their information.

3. In the Commission's abovementioned letter, it has been inter alia, directed that after the election the candidates shall submit a report about publishing of declaration to the DEO and the Political parties to the CEO of the State. The Commission has provided formats C-4 and C-5 for this purpose. The formats are also enclosed. These shall also be circulated to the DEOs, ROs and all political parties based in the State.

Yours faithfully,
(N.T. Bhutia)
Secretary

Copy to: All Recognized National and State Political Parties

సీల్ ఎలా లభించింది? అని ప్రశ్నించింది. ఈ వివాదంపై కేరళ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం వివరణ ఇచ్చింది. ''అభ్యర్థుల నేర చరిత్ర ప్రచురణకు సంబంధించిన 2019 నాటి మార్గదర్శకాలపై స్పష్టత కోరుతూ భాజపా కేరళ విభాగం ఇటీవల సీఈవో కార్యాలయాన్ని సంప్రదించింది. ఆ సమయంలో తమ వినతి పత్రంతోపాటు.. 2019 నాటి మార్గదర్శకాల ప్రతి నకలునూ సమర్పించింది. అయితే, దానిపై పార్టీ ముద్ర వేసి ఉంది. మా సిబ్బంది పొరపాటున దాన్ని గమనించలేదు. వినతిపత్రంలో కోరిన విధంగా ఇతర పార్టీలకు పంపించారు'' అని పేర్కొంది. వెంటనే ఆ లెటర్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు అధికారిక లేఖ జారీ చేశామని తెలిపింది.

# హర్మూజ్‌ని దాటి భారత్ దిశగా రెండు ఎల్పీజీ నౌకలు

దేశంలో ఇంధన కొరత ఆందోళనల వేళ.. భారత్‌కు చెందిన కొన్ని నౌకలు నెమ్మదిగా హర్మూజ్ జలసంధిని దాటుతుండటం ఒకింత ఉపశమనం కలిగిస్తోంది. తాజాగా రెండు ఎల్పీజీ నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయి. ఇరాన్‌లోని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) అనుమతితో జగ్ వసంత్, పైన్ గ్యాస్ అనే రెండు ఎల్పీజీ నౌకలు సోమవారం ఉదయం హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. త్వరలోనే ఈ నౌకలు దేశీయ పోర్టులకు చేరనున్నట్లు తెలిపాయి. దీంతో దేశీయంగా వంట గ్యాస్ లభ్యత మరికొంత పెరిగే అవకాశం ఉంది. ఉద్రిక్తతల కారణంగా భారత్‌కు చెందిన నౌకలు రోజులతరబడి అక్కడే నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మన నౌకలు సురక్షితంగా హర్మూజ్ దాటేందుకు.. ఇరాన్ అధికారులతో కేంద్రం నిరంతరం



సంప్రదింపులు జరిపింది. దీంతో కొన్ని రోజులుగా భారత నౌకలు ఒక్కొక్కటిగా దేశీయ పోర్టులకు చేరుకుంటున్నాయి. అయితే, ఇరాన్ సీనియర్ లీడర్ అలీ లారిజానీ మరణం, ఆ దేశ చమురుక్షేత్రాలపై అమెరికా దాడులు వంటి కారణాలతో నౌకల ప్రయాణానికి అనుమతులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది.

# యుద్ధ విమానాలు, క్షిపణుల సమాచారం పాక్‌కు లీక్.. వాయుసేన ఉద్యోగి అరెస్ట్

పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తోన్నట్లు వచ్చిన ఆరోపణలపై భారత వాయుసేనలో(Air Force) పనిచేస్తున్న ఓ ఉద్యోగిని రాజస్థాన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడికి పాక్ హ్యాండ్లర్లతో విస్తృత పరిచయాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఓ కేసు దర్యాప్తులో తీగ లాగితే.. ఈ గూఢచర్యం విషయం బయటపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది జనవరిలో రాజస్థాన్‌లోని జైసల్మేర్‌కు చెందిన జబరా రామ్‌ను ఓ కేసులో పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అతడిని ప్రశ్నించగా.. పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలతో సంబంధం ఉన్న సుమిత్ కుమార్ (Sumit Kumar) గురించి తెలిసింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన 36 ఏళ్ల సుమిత్.. అస్సాంలోని దిబ్రుగఢ్ జిల్లాలో



చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో మల్టీ టాస్కింగ్ వింగ్‌లో పనిచేస్తున్నాడు. తన ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకొని భారత్ వాయుసేనకు చెందిన అత్యంత రహస్య సమాచారాన్ని పాక్‌కి అందించినట్లు దర్యాప్తులో తేలింది. డబ్బు కోసం అతడే ఈ సమాచారాన్ని సోషల్ మీడియా వేదికగా పాక్ హ్యాండ్లర్లకు షేర్ చేసినట్టు గుర్తించారు. సుమిత్‌ను అరెస్ట్ చేసేందుకు రాజస్థాన్ ఇంటెలిజెన్స్‌తో పాటు ఎయిర్‌ఫోర్స్ ఇంటెలిజెన్స్ జాయింట్ ఆపరేషన్ నిర్వహించాయి. అరెస్ట్ అనంతరం దర్యాప్తు కోసం నిందితుడిని జైపూర్ తరలించారు. అతడికి 2023 నుంచి పాకిస్థానీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీతో సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. వారి నుంచి డబ్బు తీసుకొని.. యుద్ధ విమానాలు (aircraft), క్షిపణుల వ్యవస్థ, వాటి స్థానం, ఎయిర్‌ఫోర్స్ అధికారులు, ఉద్యోగులకు సంబంధించిన కీలక సమాచారాన్ని పాక్‌హ్యాండ్లర్లకు చేరవేసినట్టు తేలింది. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# హర్మూజ్‌లో ఛార్జీల వార్తలు.. స్పందించిన ఇరాన్ ఎంబసీ

హర్మూజ్ జలసంధి (Strait Of Hormuz) ని దాటే నౌకల నుంచి ఇరాన్ 2మిలియన్ డాలర్ల చొప్పున ఫీజులు విధించనున్నట్టు వస్తున్న వార్తలను భారత్‌లోని ఇరాన్ దౌత్య కార్యాలయం (Iran Embassy in India) ఖండించింది. ఫీజులకు సంబంధించి తమ అధికారులు ఎవరూ అటువంటి ప్రకటన చేయలేదని.. కొందరు వ్యక్తులు వ్యక్తిగత అభిప్రాయాలు చెప్పారని పేర్కొంది. వాటితో ఇరాన్




ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని తెలిపింది. అవన్నీ నిరాధార ఆరోపణలని..ఆ వార్తల్లో నిజం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు చేసింది. హర్మూజ్‌ను దాటే నౌకల నుంచి 2 మిలియన్ డాలర్ల చొప్పున ఫీజులు వసూలు చేయనున్నట్టు ఇరాన్ పార్లమెంట్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యుడు అలాయుద్దీన్ బరూజెర్ది ప్రకటించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. యుద్ధం కారణంగా ఖర్చులు పెరగడంతో ఈ ఛార్జీలు వసూలు చేయాల్సివస్తోందని తెలిపింది. తమ విద్యుత్తు ప్లాంట్లపై అమెరికా దాడి చేస్తే.. తాము ఇజ్రాయెల్ ఎనర్జీ ప్లాంట్లను లక్ష్యంగా చేసుకొంటామని ఆయన హెచ్చరించినట్లు తెలిపింది.

# బ్రహ్మాస్త్రాన్ని కొట్టిన పిచ్చుక..

ఆర్థికంగానే కాదు... మిలటరీ శక్తిలో అగ్రరాజ్యం అమెరికా. ప్రపంచానికి పోలీసు అని చెప్పవచ్చు. ఎక్కడ అలజడి జరిగినా అక్కడకి వెళుతుంది. అమెరికా మిలట్రీ బడ్జెట్ కొన్ని దేశాల బడ్జెట్ కన్నా ఎక్కువగానే ఉంటుంది. భారీ యుద్ధనౌకలు, రాడార్లు సైతం పసిగట్టలేని స్టెల్త్ విమానాలు వీరి అమ్ముల పొదిలో ఉన్నాయి. అమెరికా వద్ద ఉన్న ఎఫ్35 యుద్ధవిమానం శత్రువుల రాడార్లకు చిక్కదు. దీంతో శత్రుదేశాల గగనతలాలపై స్వేచ్ఛగా విహరించి దాడులు చేయగలదు. ఇది అమెరికా వద్ద ఉన్న బ్రహ్మాస్త్రం. ఈ విమానం ధర వందల కోట్లలో ఉంటుంది. అయితే పిచ్చుక లాంటి ఇరాన్ డ్రోన్ దీనిపై దాడిచేసిందన్న వార్తలు సంచలనంగా మారాయి

*** వేడిని పట్టుకుంది.. పిచ్చుక దాడి చేసింది..**


ఎంత అధునాతన ఆయుధమైనా వాటికి కొన్ని పరిమితులు, బలహీనతలు ఉంటాయి. ఎంత రాడార్ల కన్నుగప్పినప్పటికీ ఇంజిన్ బాగా వేడిగా ఉంటుంది. ఇక్కడే ఇరాన్ దెబ్బకొట్టింది. ఆకాశంలో



వస్తున్న విమాన ఇంజిన్ ఉష్ణోగ్రతలను గుర్తించింది. వెంటనే డ్రోన్‌తో దాడి చేసింది. ఫలితంగా దెబ్బతిన్న విమానం కిందవున్న ఎయిర్‌బేస్‌లో అత్యవసరంగా దిగాల్సివచ్చింది. ఇన్‌ఫ్రారెడ్ సెర్చ్ అండ్ ట్రాక్ సెన్సార్లను ఇరాన్ వాడి ఉండవచ్చన్న అనుమానాలను అమెరికా నిఘావర్గాలు వ్యక్తంచేస్తున్నాయి.




# ఒక్క ప్రకటనతో చమురు ధరలు కిందకి.. బంగారం, వెండి పైకి!



అంతర్జాతీయ పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లో తెరవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం జారీ చేయడం.. ప్రతిగా తాము హర్మూజ్ పూర్తిగా మూసివేస్తామని ఇరాన్ హెచ్చరికలతో యుద్ధం ఎటు వెళ్తుందోనన్న భయాలు నెలకొన్నాయి. దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమనగా.. బంగారం, వెండి ధరలు భారీగా క్షీణించాయి. ఇది సోమవారం ఉదయం నాటి పరిస్థితి! సీన్ కట్ చేస్తే సోమవారం సాయంత్రానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై కాల్పుల విరమణ ప్రకటించారు. ఆ దేశ ఇంధన మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలపై దాడులను ఐదు రోజుల వరకు వాయిదా వేయాలని తమ బలగాలను ఆదేశించినట్లు చెప్పారు. దీంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పతనం కాగా.. తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మళ్లీ పుంజుకొన్నాయి.

**దిగొచ్చిన చమురు ధరలు**

ఇరాన్‌పై దాడులను తాత్కలికంగా నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు దిగి వచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 13 శాతం మేర పతనమై 96 డాలర్ల స్థాయికి చేరింది. అంటే ఒక్క ప్రకటనతో 17 డాలర్ల మేర దిగొచ్చింది. అలాగే, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ సైతం 13 డాలర్లు క్షీణించి 85 డాలర్ల స్థాయికి చేరింది.

**బంగారం, వెండి పైకి..**

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం, వెండి ధరలు సోమవారం ఉదయం భారీగా పతనమయ్యాయి. ద్రవ్యోల్బణ భయాలు, డాలరు బలోపేతం కావడంతో వీటి విలువలు భారీగా క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్సు ఓ దశలో 4099 డాలర్లకు చేరింది. ట్రంప్ ప్రకటనతో మళ్లీ బంగారం పుంజుకొంది. సోమవారం రాత్రి 8 గంటల సమయానికి 4474 డాలర్లకు చేరింది. వెండి ఔన్సు 70 డాలర్లకు సమీపించింది. ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల ఓ దశలో రూ.1.36 లక్షలు పలకగా.. రాత్రికి మళ్లీ రూ.1.46 లక్షలకు చేరింది. వెండి కిలో రూ.2.10 లక్షల నుంచి రూ.2.32 లక్షలకు పెరిగింది.

ఇదే ప్రకటన స్టాక్ మార్కెట్ ముగియక ముందు వచ్చి ఉంటే మన మార్కెట్‌లు కూడా భారీ నష్టాల నుంచి గట్టెక్కి ఉండేవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం గిఫ్ట్ నిఫ్టీ 920 పాయింట్లకు పైగా లాభంతో 23,391 వద్ద ట్రేడవుతోంది. ఈ లోపు ఎలాంటి ప్రకటనా రాకపోతే మంగళవారం మన మార్కెట్లు దూసుకెళ్లడం ఖాయం అని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

# విదేశాల్లో క్రెడిట్ కార్డులను దీనికి వాడుతున్నారా? అయితే జాగ్రత్త!

భారతీయ బ్యాంకులు జారీ చేసే ఇంటర్నేషనల్ క్రెడిట్ కార్డులను వాడుతున్నారా? అయితే, ఈ విషయం తెలియకుండా లావాదేవీలు జరిపితే మీరు చిక్కుల్లో పడ్డట్లే. భారతీయ చట్టాలపై అవగాహన లేకుండా చేసిన లావాదేవీల కారణంగా కొందరు భారతీయులు చిక్కుల్లో పడ్డారు. దుబాయ్ ప్రాపర్టీ కొనుగోళ్లకు తమ క్రెడిట్ కార్డులను వాడడంతో వారికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరిలో ముగ్గురు వ్యక్తులకు ఈతరహా నోటీసులు జారీ అయినట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఎకనామిక్ టైమ్స్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఇంతకీ నిబంధనలు ఏం చెబుతున్నాయ్? యూఏఈలో ప్రాపర్టీ డెవలపర్లకు డిపాజిట్ మొత్తంగా చెల్లించేందుకు వీరు తమ ఇంటర్నేషనల్ క్రెడిట్ కార్డులను వినియోగించినట్లు భావిస్తున్నారు. భారతీయ చట్టాల ప్రకారం.. అప్పులు చేసి విదేశాల్లో ఆస్తులు కొనుగోలు చేయడం నిషిద్ధం. క్రెడిట్ కార్డు కూడా ఓవిధంగా తాత్కాలిక అవసరాలను తీర్చే రుణం లాంటిదే. కాబట్టి ఫారిన్ ఎక్స్ఛేంజీ నిబంధనలు ఇందుకు అంగీకరించవు. భారతీయులు ఎవరైనా విదేశాల్లో ఆస్తులు కొనాలనుకుంటే లిబరైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (LRS) కింద అధికారిక బ్యాంకింగ్ ఛానెల్స్ ద్వారా మాత్రమే డబ్బు పంపాలి. క్రెడిట్ కార్డులను కేవలం విదేశీ ప్రయాణాల్లో హోటల్



బుకింగ్స్, షాపింగ్ లేదా పుస్తకాలు కొనడం వంటి వ్యక్తిగత ఖర్చులకు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. చాలామంది భారతీయులు చట్టాలపై అవగాహన లేక ఇలాంటి పొరపాట్లు చేస్తుంటారని పన్ను నిపుణులు సూచిస్తున్నారు. ఇలా నోటీసులు అందుకున్న వ్యక్తులు తెలియక చేసిన తప్పు కాబట్టి క్షమించి విడిచి పెట్టాలని కోరే అవకాశం ఉంటుందన్నారు. చేసిన తప్పునకు పరిహారంగా కొత్త మొత్తం పెనాల్టీగా చెల్లించి బయటపడొచ్చు. కొన్ని సందర్భాల్లో మాత్రం కొనుగోలు చేసిన ఆస్తిని అమ్మేసి ఆ డబ్బును తిరిగి భారత్‌కు తీసుకురావాలని ఆర్‌బీఐ ఆదేశించే అవకాశమూ లేకపోలేదని చెబుతున్నారు. అయితే, హవాలా నెట్‌వర్క్ ద్వారా ఈ నగదు ఏమీ వెళ్లలేదు కాబట్టి ఆ సొమ్మును వెనక్కి తీసుకురావాలని ఆదేశించకపోవచ్చని పలువురు బ్యాంకర్లు పేర్కొంటున్నారు. ఏదేమైనా ఇలాంటి నిర్ణయాలు తీసుకొనేముందు సంబంధిత నిపుణులను సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు.

# 10 కిలోల ఎల్‌పీజీ సిలిండర్లు.. స్పందించిన కేంద్రం

దిల్లీ: ఎల్‌పీజీ సిలిండర్ బరువును 14.2 కిలోల నుంచి 10 కిలోలకు తగ్గించే అవకాశాలున్నట్లు వచ్చిన వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. అవన్నీ ఊహాగానాలే అంటూ కొట్టిపారేసింది. ఈ మేరకు పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వివరణ ఇచ్చారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఏర్పడిన వంటగ్యాస్ కొరతను అధిగమించేందుకు చమురు సంస్థలు సిలిండర్ బరువును తగ్గించే యోచనలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. గృహ అవసరాలకు 10 కేజీల ఎల్‌పీజీ సిలిండర్లను పంపిణీ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం గృహ అవసరాల కోసం 14.2 కిలోల ఎల్పీజీ సిలిండర్లను పంపిణీ చేస్తున్నారు. దీనిని 10 కిలోలకు తగ్గించాలని, పాత సిలిండర్లలోనే 10 కేజీల ఎల్‌పీజీని నింపి అందించే అవకాశాలను పరిశ్రమ వర్గాలు పరిశీలిస్తున్నట్లు




సదరు కథనాలు పేర్కొన్నాయి. గృహ అవసరాలకు సిలిండర్ల కొరత రాకుండా చూసేందుకు ఈ వ్యూహాన్ని అమలుచేయాలని ఇంధన కంపెనీలు యోచిస్తున్నాయనేది ఆ వార్తల సారాంశం. సాధారణంగా 14.2 కిలోల గ్యాస్ సిలిండర్‌ను సగటున ఒక కుటుంబానికి 35-40 రోజులు వస్తుంది. అదే 10 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ అయితే దాదాపు నెల రోజులు వస్తుందని అంచనా. సంక్షోభ పరిస్థితుల్లో పంపిణీ అందరికీ చేరేలా ఈ మార్పులు చేయాలని భావిస్తున్నట్లుగా ఈ ఉదయం వార్తలు రాగా.. అలాంటిదేమీ లేదని తాజాగా కేంద్రం క్లారిటీ ఇచ్చింది.

# ఎంపీసీ షెడ్యూల్ విడుదల చేసిన ఆర్‌బీఐ

2026-27 ఆర్థిక సంవత్సరంలో జరిగే ద్రవ్య పరపతి విధాన కమిటీ (MPC) సమావేశాల షెడ్యూల్‌ను రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (RBI) విడుదల చేసింది. కొత్త ఆర్థిక సంవత్సరంలో మొదటి సమావేశం ఏప్రిల్ 6-8 మధ్య జరగనుంది. ఏప్రిల్ 8న సమావేశ నిర్ణయాలు వెలువడనున్నాయి. రెండో సమావేశం జూన్ 3-5 తేదీల్లో నిర్వహించనున్నారు. మిగిలిన సమావేశాలు ఆగస్టు, అక్టోబర్, డిసెంబర్, ఫిబ్రవరి మాసాల్లో ఉంటాయి. దేశంలో ద్రవ్యోల్బణం ఆధారంగా వడ్డీ రేట్లను (రెపో రేటు) ఆర్‌బీఐ నిర్ణయిస్తుంది. ఇందుకోసం ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ ఉంటుంది. ఆర్‌బీఐ గవర్నర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. రెపో రేటు నిర్ణయించడానికి ప్రతి ఆర్థిక సంవత్సరంలో రెండు నెలకొకసారి ఆర్‌బీఐ సమావేశాలు నిర్వహిస్తుంది. సభ్యుల ఏకాభిప్రాయంతో సమావేశం చివరి రోజు ఆర్‌బీఐ గవర్నర్ ఎంపీసీ భేటీ నిర్ణయాలను వెల్లడిస్తారు. ఫిబ్రవరిలో జరిగిన భేటీలో రెపో రేటులో ఎలాంటి మార్పులు చేయలేదు.

## వైభవ్ సూర్యవంశీపై అందరి కళ్లూ.. రాణిస్తే టీమ్‌ఇండియాలో ఛాన్సు!

14 ఏళ్ల కుర్రాడికి ఐపీఎల్‌లో అవకాశం దక్కడమే గొప్ప. అలాంటిది గత ఏడాది ఆ వయసులో బరిలోకి దిగి విధ్వంసక బ్యాటింగ్‌తో అందరినీ ఆశ్చర్యపరిచాడు వైభవ్ సూర్యవంశీ. గత ఏడాది కాలంలో అండర్ 19 స్థాయిలో నిలకడగా రాణించిన ఈ కుర్రాడిపై ఈ ఐపీఎల్ ముంగిట అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిన్నోడు ఈసారి కూడా ఐపీఎల్‌లో రాణించాడంటే.. టీమ్‌ఇండియాలో చోటు రూపంలో పెద్ద అవకాశం అతడి తలుపు తట్టే అవకాశముంది. ఐపీఎల్ ఆరంభమవుతుంటే.. అభిమానుల దృష్టి ఆటోమేటిగ్గా విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, మహేంద్ర సింగ్ ధోని లాంటి సూపర్ స్టార్ల మీదికి మళ్లుతుంది. ఈసారి వాళ్లు ఎలా ఆడతారో.. వాళ్ల జట్లు ఎలాంటి ప్రదర్శన చేస్తాయో అని చర్చించుకుంటారు. లీగ్‌కు ఆకర్షణ తెచ్చేది, స్టేడియాలకు అభిమానులను రప్పించేది ఇలాంటి ఆటగాళ్లే. ఐతే ఈసారి ఇలాంటి లెజెండరీ క్రికెటర్లతో పాటు ఆసక్తి రేకెత్తిస్తున్న యువ ఆటగాళ్లలో వైభవ్ సూర్యవంశీ ఒకడనడంలో సందేహం లేదు. 14 ఏళ్ల చిన్న




వయసులోనే అతను అభిమానుల దృష్టిని అమితంగా ఆకర్షిస్తున్నాడు. ఈసారి అతడి ఆట చూసేందుకు స్టేడియాలకు రావడమే కాదు.. టీవీల్లోనూ అభిమానులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. గత ఏడాదిగా తన ఆట అంతగా చర్చనీయాంశం అయింది మరి. ఈ సీజన్లో అంచనాలకు తగ్గట్లు రాణిస్తే.. అతను స్టార్‌గా అవతరించే అవకాశముంది.

**13 ఏళ్లకే 1.10 కోట్లు**

ఐపీఎల్ ఆరంభం నుంచి రాజస్థాన్ రాయల్స్ కుర్రాళ్లకే పెద్ద పీట వేస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గత ఐపీఎల్ సీజన్ ముంగిట వేలంలో వైభవ్ సూర్యవంశీని ఆ జట్టు ఎంచుకుంది. అప్పటికి తన వయసు 13 సంవత్సరాలే కావడం గమనార్హం. స్కూల్ చదువు కూడా పూర్తి చేయని ఈ కుర్రాడిపై రాయల్స్ ఏకంగా రూ.1.10 కోట్లు పెట్టింది. ఇదేం విడ్డూరం అని అందరూ ఆశ్చర్యపోతుంటే.. 14 ఏళ్ల వయసులో అతడితో ఐపీఎల్ మ్యాచ్ ఆడించి ఐపీఎల్ అభిమానులకు పెద్ద షాకిచ్చింది రాజస్థాన్. అతను బలమైన బౌలింగ్ లైనప్ ఉన్న గుజరాత్ టైటాన్స్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. టైమింగ్, శక్తిని జోడించి సిక్సర్ల మోత మోగిస్తూ కేవలం 35 బంతుల్లోనే సెంచరీ కొట్టేశాడు. ఆ ఇన్నింగ్స్ నిరుడు ఐపీఎల్‌కే హైలైట్‌గా నిలిచింది. ఆ సీజన్లో మొత్తంగా 7 మ్యాచ్‌ల్లో 252 పరుగులతో తన సత్తా ఏంటో చూపించాడు వైభవ్. తన స్ట్రైక్ రేట్ 206.55 కావడం విశేషం.

## బుమ్రాకు గాయమా? ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు ఆందోళన

ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 28 నుంచి ప్రారంభం కానుంది. సమయం సమీపిస్తున్న వేళ.. ముంబయి ఇండియన్స్‌కు దెబ్బ తగిలేలా ఉంది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు గాయమైనట్లు వార్తలు వస్తున్నాయి. అతడిని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు సమాచారం. అయితే, ఇది రెగ్యులర్ చెకప్‌నా..? గాయమైందా? అనేది మాత్రం స్పష్టత లేదు. అయితే, ఇంకా అతడు ముంబయి జట్టుతో చేరకపోవడంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. గతేడాది వెన్నునొప్పి కారణంగా తీవ్రంగా ఇబ్బందిపడ్డాడు. దాన్నుంచి కోలుకుని మరీ భారత్ తరఫున టీ20 ప్రపంచ కప్‌లో మెరిశాడు.




**ముందే అనుమతి ఇచ్చాం..: మహేల**

బుమ్రా ఇంకా ప్రాక్టీస్ సెషన్‌కు హాజరు కాకపోవడంపై ముంబయి ప్రధాన కోచ్ మహేల జయవర్ధనె స్పందించాడు. గాయం కారణంగానే బుమ్రా రావడంలేదని వస్తోన్న వార్తలను కొట్టిపడేశాడు. టీ20 ప్రపంచ కప్‌ను నెగ్గిన భారత జట్టు సభ్యులు కాస్త ఆలస్యంగా ముంబయి ఇండియన్స్ శిబిరానికి చేరేందుకు అనుమతి ఇచ్చామని మహేల వెల్లడించాడు. బుమ్రా ఈ సీజన్‌లోని అన్ని మ్యాచులను ఆడే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకుడు, మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు.




## అలా చేయడం.. చెడ్డ విషయమేమీ కాదుగా

**: అక్షర్ పటేల్**

టీ20 ప్రపంచ కప్ ముగిసిన తర్వాత భారత జట్టు ఆటగాళ్లు కప్పుతో కలిసి వివిధ ఆలయాలకు వెళ్లారు. ఈ క్రమంలో పలువురు టీమ్‌ఇండియాపై విమర్శలు చేశారు. ఇదే సంప్రదాయాన్ని తాను ఐపీఎల్‌లోనూ కొనసాగిస్తానని తాజాగా దిల్లీ క్యాపిటల్స్ సారథి అక్షర్ పటేల్ వెల్లడించాడు. భారత టీ20 జట్టుకు అక్షర్ వైస్ కెప్టెన్ అని సంగతి తెలిసిందే. ఆలయాలకు వెళ్లాలనేది జట్టులోని ఎక్కువ మంది తీసుకున్న నిర్ణయమని అక్షర్ వెల్లడించాడు. 'ఆలయాలకు వెళ్లడం చెడ్డ విషయమేమీ కాదుగా..సాధారణంగా మేం ఆలయాలకు వెళ్తాం. అయితే, టోర్నీల సమయంలో సెక్యూరిటీ మా వెంట ఉంటారు'' అని అక్షర్ తెలిపాడు.

**ఆ రూల్‌పై..**

''ఒక ఆల్‌రౌండర్‌గా నాకు ఇంపాక్ట్ రూల్ ఇష్టంలేదు. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ కీలక పాత్ర పోషించే ఆల్‌రౌండర్‌ను గతంలో ఎంపిక చేసుకొనేవాళ్లం. ఇప్పుడు కేవలం బ్యాటర్ లేదా బౌలర్‌ను తీసుకొనేందుకే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపిస్తోంది. ఇక్కడ ఆల్‌రౌండర్‌తో పనేం ఉంటుంది. అందుకే, ఈ రూల్ నచ్చలేదు. కానీ, నిబంధన ఉన్నప్పుడు మనం తప్పకుండా అమలు చేయాలి. వ్యక్తిగతంగా ఇష్టంలేకపోయినా.. రూల్‌ను ఫాలో అవుతా'' అని స్పష్టం చేశాడు.

*** ఖడ్గంతో కూరగాయలు కోయలేం కదా..**

''ఫ్రాంచైజీని విజేతగా నిలపడం చాలా కష్టం. ప్రతి జట్టులో విదేశీ ఆటగాళ్లు ఉంటారు. కొన్నిసార్లు బ్యాటర్లు భిన్నమైన స్థానాల్లో ఆడాల్సి వస్తుంది. జట్టులోని ప్రతి




ఒక్కరికీ తమ పాత్ర ఏంటో పూర్తిగా తెలుసు. సోషల్ మీడియాలో వచ్చే వ్యాఖ్యలను అస్సలు పట్టించుకోం. ఏ జట్టు ఫైనల్‌కు చేరదో కూడా వారికి తెలిసిపోతుంది. అందుకే, వాటి గురించి చర్చించుకోం. లేకపోతే అనవసరమైన ఒత్తిడిని తెచ్చిపెట్టుకున్నట్లు అవుతుంది. మా జట్టులోని ప్రతి ఒక్కరి డేటా నా వద్ద ఉంది. అయితే, దానిపైనే ఎక్కువ ఆధారపడను. మ్యాచ్‌లో పరిస్థితిని బట్టి నిర్ణయాలు తీసుకుంటా. ఖడ్గంతో కూరగాయలను కోయలేం కదా..'' అని అక్షర్ పటేల్ వ్యాఖ్యానించాడు.

# పవన్ డబుల్ ధమాకా.. ఒకవైపు పొలిటికల్ థ్రిల్లర్.. మరోవైపు కమర్షియల్ ఎంటర్‌టైనర్!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంతో విజయాన్ని అందుకుని మళ్లీ ఫామ్‌లోకి వచ్చారు. హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ మాస్ ఎంటర్‌టైనర్ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తుండటంతో పవన్ తన తదుపరి చిత్రాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ఆయన 33వ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్‌లో జోరుగా చక్కర్లు కొడుతోంది. విభిన్నమైన చిత్రాల దర్శకుడు దేవా కట్టాతో పవన్ చేతులు కలపబోతున్నట్లు తెలుస్తోంది. 'ప్రస్థానం', 'ఆటో నగర్ సూర్య', 'రిపబ్లిక్' వంటి సీరియస్, వాస్తవిక కథాంశాలతో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న దేవా కట్టా, ఈసారి పవన్ కోసం ఒక పవర్‌ఫుల్ పొలిటికల్ థ్రిల్లర్ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. పవన్ కల్యాణ్ రాజకీయ సిద్ధాంతాలు, ఆయన ఆలోచనా విధానానికి అద్దం పట్టేలా ఈ సినిమా ఉండబోతుందని ఇండస్ట్రీ వర్గాల్లో




టాక్ నడుస్తోంది. ఇప్పటికే కథ లాక్ అవ్వగా, ప్రాథమిక చర్చలు కూడా పూర్తయ్యాయని అంటున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా సినిమాలు తీయడంలో దిట్ట అయిన దేవా కట్టా దర్శకత్వంలో పవన్ నటించనున్నారనే వార్త అభిమానుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది.

ఇదిలా ఉంటే... పవన్ కల్యాణ్ మరోవైపు స్టైలిష్ దర్శకుడు సురేందర్ రెడ్డితో ఓ భారీ ప్రాజెక్ట్‌కు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇదొక పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కనుంది. ఈ సినిమా కూడా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం పవన్ కల్యాణ్ ఈ రెండు ప్రాజెక్టులను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నారట. ఒకవైపు తన రాజకీయ భావజాలాన్ని ప్రతిబింబించే సీరియస్ పొలిటికల్ డ్రామా, మరోవైపు మాస్ అభిమానులను అలరించే పక్కా కమర్షియల్ చిత్రంతో ప్రేక్షకులను మెప్పించాలని ఆయన ప్లాన్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. మొత్తానికి 'ఉస్తాద్ భగత్ సింగ్' ఇచ్చిన విజయంతో పవన్ రాబోయే సినిమాలతో బాక్సాఫీస్ వద్ద మరింత సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విభిన్నమైన కాంబినేషన్స్‌పై అభిమానుల్లో అంచనాలు భారీగా నెలకొన్నాయి.

# సినిమా

## కాలమే నిర్ణయిస్తుంది



మెగా డాటర్ కొణిదెల నిహారిక వ్యక్తిగత విషయాలు నెట్టింట వైరల్ గా మారాయి. చైతన్య జొన్నలగడ్డ నుంచి విడాకులు తీసుకున్నాక, ఆమె తన పూర్తి దృష్టిని కెరీర్‌పై పెట్టింది. ఇటీవల కమిటీ కుర్రోళ్లు చిత్రంతో నిర్మాతగా మంచి విజయాన్ని అందుకున్న నిహారిక, ఇప్పుడు రాకాస అనే మరో ఆసక్తికర సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్లలో భాగంగా నిహారిక తన వ్యక్తిగత విషయాలు పంచుకుంది. తన రెండో పెళ్లి గురించి వస్తున్న వార్తలపై నిహారిక ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదని స్పష్టం చేసింది. అయితే భవిష్యత్తులో మళ్లీ పెళ్లి చేసుకునే అవకాశం లేకపోలేదని, అన్నీ కాలమే నిర్ణయిస్తుందన్నారు. తన అన్నయ్య వరుణ్ తేజ్, వదిన లావణ్య త్రిపాఠిల ప్రేమ కథ గురించి కూడా ఆమె కొన్ని రహస్యాలను బయటపెట్టింది. వారిద్దరూ ప్రేమలో ఉన్నారన్న విషయం తనకు నాలుగేళ్ల తర్వాతే తెలిసిందని, అప్పటి వరకు వారు ఆ విషయాన్ని చాలా సీక్రెట్ గా ఉంచారని తెలిపింది. వరుణ్ తేజ్ బయటకు ఇంట్రోవర్ట్ లా కనిపించినా, చాలా సరదాగా ఉంటాడని, తనను ఎప్పుడూ ఆటపట్టిస్తూనే ఉంటాడని నిహారిక చెప్పుకొచ్చింది.



## క్రేజీ కాంబో

కాలేజ్‌నుంచి ఫ్రెండ్స్ అయిన మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ కాంబో ఇండస్ట్రీలో మరో అరుదైన ఘనతను సాధించబోతోంది. దర్శకుడు ప్రియదర్శన్ తన కెరీర్‌లో ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రానికి సిద్ధమవుతున్నాడు. ఆయన తొలి చిత్రంలో నటించిన మోహన్‌లాలే ఇందులోనూ హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమా గురించి మోహన్‌లాల్ సోషల్ మీడియా వేదికగా అధికారిక ప్రకటన చేస్తూ ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నాడు. వంద సినిమాలు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదని, అది సినిమాపై ఉన్న అంకితభావానికి, అభిరుచికి నిదర్శనమని పేర్కొన్నాడు. తన స్నేహితుడి సుదీర్ఘ ప్రయాణాన్ని దగ్గరుండి చూసే భాగ్యం తనకు దక్కిందని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ చిత్రాన్ని ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరుంబవూర్ నిర్మిస్తున్నారు. ప్రియదర్శన్ తన సినీ ప్రయాణాన్ని 1984లో పూచక్కోరు మూక్కుతి అనే చిత్రంతో ప్రారంభించాడు. ఆ సినిమాకు మోహన్‌లాల్‌నే కథానాయకుడు. మొదటి సినిమాతోనే ఘనవిజయాన్ని అందుకున్న ఈ ద్వయం ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. వీరి కాంబోలో వచ్చిన కాలాపానీ అద్భుతమైన విజయంతో పాటు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది.

## అమ్మ మాటలతో కొత్త ఊపిరి

టాలీవుడ్‌లోకి మెరుపుతీగలా దూసుకొచ్చి అతి తక్కువ సమయంలోనే అగ్ర హీరోల సరసన నటించే అవకాశం దక్కించుకుని మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది శ్రీలీల. పెళ్లి సందడి చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ భామ.. తన డ్యాన్సింగ్ స్కిల్స్, ఎనర్జీతో కుర్రకారును ఆకట్టుకుంది. ఆ తర్వాత రవితేజతో చేసిన ధమాకా బ్లాక్‌బస్టర్ కావడంతో ఆమె దశ తిరిగింది. మహేశ్ బాబు, బాలకృష్ణ, పవన్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో వరుస అవకాశాలు అందుకుంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను పంచుకుంది. సోషల్ మీడియాలో తనపై వచ్చిన విపరీతమైన ట్రోలింగ్ చూసి ఒక దశలో కుంగిపోయిందట. గదిలో ఒంటరిగా కూర్చుని ఏడ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయట. ఆ బాధ భరించలేక సినిమాలు తన ఒంటికి పడవని నిర్ణయించుకుందట. ఇక తాను సినిమాలు చేయనని, మళ్లీ కాలేజీకి వెళ్లి చదువుకుంటానని చెప్పిందట. తీవ్ర నిరాశలో ఉన్న తనకు అమ్మ చెప్పిన మాటలు కొత్త ఊపిరిని పోశాయని చెప్పింది. తన గురించి ప్రజలు అంత టైమ్ వేస్ట్ చేసుకుంటున్నారంటే తాను ఎదిగినట్లు అర్థమని చెప్పిందట.



## ఇప్పుడు ఇండస్ట్రీ పరిస్థితి ఏంటో అందరికీ తెలుసు: శర్వానంద్



యువ హీరో శర్వానంద్ తెలుగు సినీ పరిశ్రమ ప్రస్తుత పరిస్థితిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఇండస్ట్రీ పరిస్థితి ఏమిటో అందరికీ తెలుసు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఆదివారం జరిగిన తన కొత్త సినిమా 'బైకర్' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచి సినిమాలు రావాలన్నా, నిర్మాణ వ్యయం అదుపులో ఉండాలన్నా నిర్మాతల పాత్ర చాలా కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. సినిమా నిర్మాణంలో నిర్మాత క్రియాశీలత గురించి శర్వానంద్ వివరిస్తూ, "నిర్మాతలు స్క్రిప్టు దశ నుంచి ప్రతిరోజూ సెట్‌కు వచ్చి దగ్గరుండి పనులు చూసుకుంటే ప్రొడక్షన్ ఖర్చు పెరగదు. అప్పుడే మంచి సినిమాలు తీయగలం" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'శతమానం భవతి' సినిమాకు నిర్మాత దిల్ రాజు దగ్గరుండి పాటలు రాయించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. దిల్ రాజులాగే యూవీ క్రియేషన్స్ వంశీ, నిర్మాత బన్నీ వాసు కూడా తమ సినిమాల పట్ల ఎంతో డెడికేషన్‌తో పనిచేస్తారని శర్వానంద్ ప్రశంసించారు. నిర్మాతలు హీరోల వెనకుండి, మంచి కథలతో బడ్జెట్‌లో సినిమాలు తీసి డబ్బులు సంపాదిస్తే అందరూ బాగుంటారు. హీరోలకు కూడా అది చాలా సంతోషాన్నిస్తుందన్నారు. నిర్మాతలందరూ ఈ పద్ధతి పాటిస్తే పరిశ్రమకు మేలు జరుగుతుందని ఆయన సూచించారు.

## ధురంధర్2 చిత్రంపై నాగార్జున రివ్యూ



టాలీవుడ్ కింగ్ నాగార్జున... బాలీవుడ్‌లో సంచలనం సృష్టిస్తున్న 'ధురంధర్: ది రివెంజ్' చిత్రంపై ప్రశంసల వర్షం కురిపించారు. ఇదొక స్ఫూర్తిదాయక చిత్రమని, భారత సినీ పరిశ్రమలో సరికొత్త మార్పునకు నాంది పలుకుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. "'ధురంధర్: ది రివెంజ్' అనే ఒక అద్భుతమైన సినిమా చూశాను! వాట్ ఏ రైడ్! ఈ సినిమా నా మతి పోగొట్టింది. చూసినప్పటి నుంచి ఇప్పటికీ దాని గురించే ఆలోచిస్తున్నాను, ఆ ప్రభావం నుంచి బయటకు రాలేకపోతున్నాను.సినిమా నిర్మాణ శైలిని మార్చేసే, ఎంతో స్ఫూర్తినిచ్చే అరుదైన చిత్రాలలో ఇదీ ఒకటిగా నిలిచిపోతుంది. ఇంత స్ఫూర్తిదాయకమైన చిత్రాన్ని అందించిన దర్శకుడు ఆదిత్య ధర్‌కు నా హృదయపూర్వక అభినందనలు. ఆయనతో పాటు కెమెరా, సంగీతం, సౌండ్ డిజైన్, యాక్షన్, ఆర్ట్ విభాగాలతో సహా పనిచేసిన మొత్తం టెక్నికల్ టీమ్‌కు కూడా నా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. ఇక నటీనటుల గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రతి ఒక్కరూ ఎంతో అద్భుతంగా నటించారు. మీరందరూ అదరగొట్టారు. ఈ గొప్ప చిత్రానికి మా అన్నపూర్ణ స్టూడియోస్ హైదరాబాద్ డాల్బీ సినిమా ప్రాసెసింగ్‌తో పాటు, సౌత్ ఇండియన్ భాషల లోకలైజేషన్ సేవలను అందించిందని చెప్పడానికి నేను చాలా గర్వపడుతున్నాను" అంటూ నాగార్జున తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించిన 'ధురంధర్: ది రివెంజ్' ఇటీవలి కాలంలో భారతీయ సినిమాలో అతిపెద్ద విజయాల్లో ఒకటిగా నిలిచింది. విడుదలైన అన్నిచోట్లా భారీ ఆదరణతో పాటు డబ్బింగ్ వెర్షన్లు కూడా మంచి వసూళ్లు సాధిస్తున్నాయి. హైపర్‌స్టైలైజ్డ్ యాక్షన్, జాతీయవాదం వంటి అంశాలతో ఈ ఫ్రాంచైజీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది.

### ఈ ఇద్దరూ సై అంటే... ప్రత్యేకమే?

అగ్ర కథానాయకులు అల్లు అర్జున్, రామ్‌చరణ్ సినిమాల విషయంలో కొన్ని ఆసక్తికరమైన సంగతులు వినిపిస్తున్నాయి. ఆ సంగతులు కూడా అనుష్కశర్మ, మృణాల్ ఠాకూర్‌లతో ముడిపడి ఉండటం విశేషం. ప్రచారంలో ఉన్నదే నిజమైతే మాత్రం వాళ్లు తీసుకున్న నిర్ణయాలు ఎంతో ప్రత్యేకం కానున్నాయి. మరి ఆ కథానాయికల నిర్ణయమేమిటన్నది త్వరలోనే వెలుగులోకి రానుంది. అల్లు అర్జున్ కథానాయకుడిగా.. అట్లీ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో కథానాయికలుగా ఇప్పటికే దీపికా పదుకొణె, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ ఎంపికైనట్టు ప్రచారం సాగుతోంది. తాజాగా ఆ జాబితాలో అనుష్కశర్మ పేరు కూడా చేరింది. ఆమె ప్రధాన కథానాయికగా నటించి చాలా రోజులైంది. అట్లీ సినిమాలో ఓ కీలకమైన పాత్ర కావడంతో చిత్రబృందం అనుష్కని సంప్రదించినట్టు తెలుస్తోంది. ఆమె ఒప్పుకున్నారంటే మాత్రం అనుష్కశర్మ నటించే తొలి తెలుగు సినిమా ఇదే అవుతుంది. ఆమె రీఎంట్రీ ఇచ్చిన సినిమా ఇదే అవుతుంది. ఇక మృణాల్ ఠాకూర్ విషయానికొస్తే... ఆమెను రామ్‌చరణ్ సినిమా 'పెద్ది'లో ప్రత్యేకగీతం కోసం చిత్రబృందం సంప్రదించిందని సమాచారం.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.